ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జనవరి 11, 2015

మనసును
కదిలించే మాటకారి

సొంతూరు...
సంక్రాంతి...

నందమూరి వారింట ఖాకీలు

ఎన్టీఆర్

కళ్యాణ్‌రామ్



బాలకృష్ణ

వెండితెర మీద పోలీస్ అధికారులుగా మెప్పించిన తారలెందరో! ఈసారి ప్రత్యేకత ఏమంటే... నందమూరి కుటుంబానికి చెందిన ముగ్గురు హీరోలు ఖాకీ బట్టల్లో కనిపించనున్నారు. ఆ మూడు సిన్మాలు రాబోయే మూడు మాసాల్లో విడుదల కానుండడం విశేషం. ఇంతకీ ఆ హీరోలెవరయా అంటే... నందమూరి కళ్యాణ్‌రామ్, జూనియర్ ఎన్టీఆర్, బాలకృష్ణ. ఈ నెల చివరికి కళ్యాణ్‌రామ్ నటించిన 'పటాస్' విడుదల కానుంది. కళ్యాణ్ గతంలోనూ 'హరే రామ్' ద్వారా పోలీస్ క్యారెక్టర్లో కనిపించాడనుకోండి. మాటల రచయిత అనిల్ రావిపూడి ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నాడు. ఇక పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'టెంపర్'తో ఎన్టీఆర్ పోలీస్‌గా అలరించనున్నాడు. ఈ చిత్రం ఫిబ్రవరిలో థియేటర్లకు రానుంది. ఎన్టీఆర్ గతంలో 'బాద్‌షా'లో కొద్దిసేపు పోలీస్‌గా కనిపించాడు. బాలకృష్ణ పోలీస్‌గా నటిస్తున్న 'లయన్' మార్చిలో విడుదలౌతుంది. త్రిష, రాధికా ఆంప్టే కథానాయికలు. సత్యదేవ్ తొలిసారిగా మెగా మైక్ పట్టుకున్న చిత్రమిది. బాబాయ్ అబ్బాయిల్లో పోలీస్‌గా ఎవరు ఎక్కువ మార్కులు కొట్టేస్తారో చూడాలి. ●

డబుల్ ధమాకా!

బిపాషా

కంగనా

ద్విపాత్రాభినయం అంటే చాలు! హీరోలే గుర్తొస్తారు. మరీ ముఖ్యంగా బాలీవుడ్‌లో. అయితే ఇప్పుడా రికార్డును తిరగరాయబోతున్నారు కథానాయికలు. 'అలోన్' చిత్రంలో బిపాషా బసు డబుల్ రోల్ చేస్తోంది. అవిభాజ్య అక్కాచెల్లెళ్లగా బిప్స్ ఇందులో కనిపిస్తుంది. ఇక 'రాయ్' సినిమాలో జాక్విలిన్ ఫెర్నాండెజ్ కూడా కవలలుగా చేస్తోంది. 'తను వెడ్స్ మను2'లో కంగనా రౌనత్, 'దేశీ మేజిక్'తో ఆమీషా పటేల్ కూడా ద్విపాత్రాభినయంతో అలరించనున్నారు. సన్నీ లియోన్, అనుష్క శర్మ సైతం 'మస్తీ జాదే, బాంబే వెల్వెట్'లో డబుల్ రోల్ చేస్తున్నారు. డబుల్ ధమాకా! చూసే వారికి బానే వున్నా... చేసేవారికే తిప్పలు. ఒక్కరే ఇద్దరిలా.. వేర్వేరు కట్టు, బొట్టు, మాట,నడకతో మెప్పించడమంటే మాటలా. గతంలోనూ 'సీత ఔర్ గీత' వంటి చిత్రాల్లో కథానాయికలు అడపా దడపా రెండేసి పాత్రలు పోషించడం చూశాం. అయితే ఒకేసారి ఇంతమంది హీరోయిన్లు ద్విపాత్రాభినయం చేయడం మాత్రం రికార్డే. ●



ఆమీషా

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

డూ..డూ.. బసవన్న...

పల్లె అందాలు చూడాలి. సరదాగా గడపాలి అంటే సంక్రాంతే సరైన సమయం. కళ్లాపి చల్లిన వాకిళ్లు.. ముగ్గులు... గొబ్బెమ్మలతో నిండుగా వుంటాయి వీధులు. రంగురంగుల బట్టలు, గంటలు, గజ్జెలు అలంకరించిన గంగిరెద్దును నడిపించుకుంటూ... సన్నాయి వాయించుకుంటూ ప్రతి ఇంటికి వచ్చే గంగిరెద్దులవాడు ప్రత్యేక ఆకర్షణ. గంగిరెద్దులవాడు 'అయ్యగారికి నమస్కారం చెయ్యి. అమ్మగారికి దండం పెట్టు. చిన్న అమ్మగారికి సలామ్ చెప్పు....' అనడం ఆలస్యం! వంగి మరీ తల ఆడిస్తుంటుంది గంగిరెద్దు. దానికి తెల్సిన విద్య అదే మరి! అలాంటివారు మనలోనూ వుంటారంటే గబుక్కున నమ్మబుద్ధి కాదు. 'ఔనా...నిజమా....!?' అని తెగ ఆలోచించేస్తాం.

అమ్మానాన్నలు చెప్పినట్టే వింటుంటారు పసివాళ్లు. వారు చెప్పిన ప్రతి దానికీ 'అలాగేనమ్మా...సరే నాన్నా' అంటూ తల ఆడించేస్తారు. మాష్టార్లు చెప్పినదానికీ అంతే (ఎదురు చెప్తే ఏమౌతుందోనని భయం మరి)! ఇహం మరచి ...ప్రేమ లోకంలో విహరిస్తున్న యువకుడు... ప్రేయసి ప్రతి మాటకూ ఆడించేస్తాడు తల (కాదంటే ఆమె కోపాగ్నులకు భస్మమైపోడూ). బాస్ ముందు కింది ఉద్యోగులు డూడూ బసవన్నలే (లో..లోపల ఏమనుకున్నా). పెళ్లయిన కొత్తలో ఆర్నెల్లపాటు... భార్య చెప్పిన మాటకల్లా తల ఊపేస్తాడు భర్త (ఆ తర్వాతే పాత్రలు మారిపోతుంటాయి). 'సిగరెట్ తాగొద్దన్నా, మద్యం ముట్టుకోవద్దన్నా..ఇదీ అదీ అనేముంది? వైద్యుడు చెప్పిన ప్రతిదీ పాటించేస్తామని తలాడించేస్తారు రోగులు (అయిష్టంగా...నే).

ఇక రాజకీయ నాయకుల సంగతి చెప్పేదేముంది? ఓట్లడగడానికి వచ్చినప్పుడు ఓటరు చెప్పినదానికల్లా ఊపేస్తారు తల (గద్దెనెక్కాక అవేవీ గుర్తుండవన్న ధీమాతోనే). హైకమాండ్ ముందు సీఎంలైనా, పీఎంలైనా డూడూ బసవన్నలే (పోస్ట్ ప్రధానం కదా). ఐ.ఎం.ఎఫ్, వరల్డ్ బ్యాంకుల ముందైతే మరీనూ. అగ్రరాజ్యం అమెరికా ముందైతే ఇక చెప్పే పనే లేదు?! అది య్యస్ అంటే య్యస్. నో అంటే నో! అంతే!! (గంగిరెద్దే బెటరేమో! గంగిరెద్దుల వాడు మాట చెప్పేవరకైనా నిటారుగా నిల్చుంటుంది). నేతలు చెప్పిన ప్రతి దానికీ మనం కూడా గంగిరెద్దులా తలాడిస్తే... అంతే సంగతులు! ప్రశ్నించడం... అవసరమైతే ఎదురు తిరగడం...పోరాడి సాధించుకోవడం కూడా నేర్చుకోవాలి మరి!!

■

◆ మనలో మాట



టపా

'సాహన చంద్రుడు' ఆకట్టుకుంది

డిసెంబర్ 28, 2014 స్నేహలో ప్రచురితమైన 'పురుషులకున్న హక్కులన్నీ మహిళలకూ ఉంటాయి' అన్న మేరీ కోమ్ ఇంటర్వ్యూ స్ఫూర్తి కలిగించింది. చూద్దామాలో గోపురమా నీ నీడ ఎక్కడమ్మా కథకం బాగుంది. చోళరాజుల శిల్ప కళాభిరుచిని తెలియచేసే తంజావూరు శిల్పాల గురించి చక్కగా వివరించారు. ఏ సమయంలోనూ నీడపడని బృహదీశ్వరాలయ గాలి గోపురం ప్రత్యేకత గురించి చదువుతుంటే ఆసక్తిగా అనిపించింది. సినిమా కబుర్లులో అమీర్ ఖాన్ ఇంటర్వ్యూ బాగుంది. ముఖ్యంగా సెలబ్రెటి అయిన అమీర్ కుటుంబ జీవితంలోనూ ఎలా నడుచుకుంటాడో తెలిసింది. వృత్తి జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ నిబద్ధత కలిగిన వ్యక్తి అమీర్. తెలుగు, తమిళ చిత్ర దర్శకుడు కె.బాలచందర్ మరణం సినీ లోకానికే లోటు. మూసధోరణితో కాక ఒక కొత్త వరవడితో చిత్రాలను తీసిన దర్శకుడు. ఆయన సినిమాల్లోని ప్రత్యేకతలను విశ్లేషిస్తూ వచ్చిన కథనం 'సాహన చంద్రుడు' మమ్మల్ని ఆకట్టుకుంది. నవ్వుల్-పువ్వుల్ లో వచ్చే జోక్స్ రొటీన్‌గా ఉన్నాయి. మిగతా కథనాలన్నీ బాగున్నాయి.

-ఎన్. నరేష్, తెనాలి

సమాజానికి అవసరం

స్నేహలో ప్రచురితమైన 'పుస్తకాల పండుగలు' కథనం చాలా ఆసక్తిగానూ, ప్రయోజనకరంగానూ అనిపించింది. విజయవాడలో జరుగుతున్న బుక్ ఎగ్జిబిషన్ గురించి, ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో జరిగే బుక్ ఎగ్జిబిషన్ గురించి చాలా మంచి సమాచారాన్ని తెలియచేశారు. 'ఆణిముత్యాల్లాంటి 30 పుస్తకాలు' పేరుతో మీరిచ్చిన సమాచారం పాఠకలోకానికి కానుక. తెలుగులో తప్పక చదవాల్సిన ముప్ఫై పుస్తకాల గురించి అందులోనూ భాషా నైపుణ్యాలను పెంచేవి, సామాజిక చైతన్యం కలిగించే మంచి పుస్తకాలను మాకు పరిచయం చేశారు. భవిష్యత్తులోకూడా పాఠకలోకానికి ఇలాంటి మంచి సందేశాత్మక సమాచారాన్ని, తెలియచేయగలరని కోరుతున్నాను. ఇవే సమాజానికి అవసరం కూడా అని నా భావన. ఇవేకాక సమ్‌థింగ్ స్పెషల్‌లో వచ్చిన విస్తరిస్తున్న అమెరికా జైళ్ల పరిశ్రమ చదువుతుంటే నేరగాళ్లను సంస్కరించ డానికి బదులు ప్రైవేటు జైళ్ల పరిశ్రమకు ద్వారాలు తెరిచిన అమెరికా విధానాలు ఎంత విడ్డూరంగా ఉన్నాయో తెలు స్తుంది. ఇంకా ఇలాంటి అంతర్జాతీయ అంశాల గురించిన కథనాలు, ఆసక్తి కలిగించేవి, ప్రజలు తెలుసుకోవాల్సిన అంశాల గురించి ఇవ్వాలని మనవి.

-పి. సుభాషిణి, అమలాపురం

కొత్తగా అనిపించాయి

డిసెంబర్ 28,2014 స్నేహ ఆదివారం అనుబంధంలో వచ్చిన అన్ని కథనాలు బాగున్నాయి. ముఖ్యంగా పుస్తకాల పండుగలు కథనం ద్వారా వివిధ ప్రాంతాల్లోని పుస్తక ఎగ్జిబిషన్ల గురించి, అక్కడ ప్రత్యేకతల గురించి తెలుసుకున్నాము. తప్పకుండా చదవాల్సిన ఆణిముత్యాల్లాంటి ముప్ఫై పుస్తకాల గురించి మీరిచ్చిన వివరాలు ప్రతి ఒక్కరూ తెలుసు కోవాలి. ప్రతి ఒక్కరూ ఆ పుస్తకాలను కూడా చదవాలి. ప్రతి వారం వస్తున్న ప్రేమ విప్లవం సీరియల్ బాగుంటుంది. రుచిలో మీరు తెలిపిన అరటితో అదుర్స్ వంటకాలు బాగున్నాయి. ప్రతి వారం మంచి వంటకాలను పరిచయం చేస్తున్నారు. బంగారం గురించి తెలిపిన విశేషాలు కొత్తగా అనిపించాయి. ఈ మధ్య ప్రతి వారం స్నేహ చదువు తున్నాము. మంచి కథనాలు, సమకాలీన అంశాలను తీసుకుంటున్నారు.

-సి.హెచ్ నాగరాజు,
అక్కయ్యపాలెం, విశాఖపట్నం

ఈ సంచికలో....

సంక్రాంతి - సొంతూరు

కవర్‌స్టోరీ ———— 14

ఏడాదిలో తొలి పండుగ. ఏడాదికోసారొచ్చే పండుగ. పెద్ద పండుగ....తెలుగు వారికే సొంతమైన పండుగ. పల్లెటూరి పండుగ. కష్టజీవుల పండుగ. జాన పదుల పండుగ.... సంక్రాంతి పండుగ. చదువు కోసమో... బతుకుదెరువు కోసమో, కారణమేదైనా కన్నతల్లికి, పుట్టినూరుకు దూరమయ్యాం. సొంత ఇంటికే బంధువులమయ్యాం.

స్ఫూర్తి 3
రాయుడు! సాధించాడు..

ప్రత్యేకం 4
సంక్రాంతి సంబరాలు

సమ్‌థింగ్ స్పెషల్ 5
వింత పెళ్లి- ఆస్తుల గోల

కథ 6
రేచీకటి అల్లుడు

టెక్ గురు 8
కొత్తగా...!

వింతలోకం 9
కరిని పోలిన సూకరం

నివాళి 10
మనసును కదిలించే మాటకారి

నవ్వుల్ - పువ్వుల్ 11

చూద్దామా 12
అతి ప్రాచీన ఆలయం ఆంకోర్ వాట్

సినిమా కబుర్లు 13
సిన్మాకోసం బరువు పెంచేశారు

సీరియల్ 18
ప్రేమ విప్లవం

రుచి 21
సంక్రాంతి స్పెషల్స్

బాలనేస్తాలు 22
నాలుగు త్రికోణాలు

కొత్త పుస్తకాలు 24
తప్పక చదవాల్సిన చరిత్ర

◆ స్ఫూర్తి

రాయుడు సాధించాడు..

సురేష్ రైనా, రాబిన్ ఉతప్ప, దినేష్ కార్తీక్, ఇర్ఫాన్ పఠాన్, శిఖర్ ధావన్..వీరంతా ఒకప్పుడు అండర్-19 జట్టులో తెలుగు తేజం అంబటి తిరుపతి రాయుడి సారథ్యంలో ఆడినవారే. తన కెప్టెన్సీలో ఆడిన ఆటగాళ్లందరూ అనతికాలంలోనే టీం ఇండియా జెర్సీ ధరించగా..రాయుడు మాత్రం సుదీర్ఘ కాలం నిరీక్షించాల్సి వచ్చింది. కెరీర్‌లో ఎన్నో అడ్డంకులు, మరెన్నో ఆటుపోట్లు ఎదురైనా మొక్కవోని కఠోర దీక్షతో శ్రమించిన రాయుడు..తుదకు తను అనుకున్నది సాధించాడు. ప్రపంచకప్‌లో భారత్ తరపున ఆడాలనే ఆశయాన్ని నెరవేర్చుకోనున్నాడు.

టీమ్ ఇండియాలో చోటు దక్కించుకోవాలంటే దక్షిణాది రాష్ట్రాల, మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్ర క్రీడాకారులకు అందని ద్రాక్షే. ప్రతిభ ఉన్నా జాతీయ జట్టులో చోటు సాధించడం కష్టమే! దిగ్గజ ఆటగాడు వి.వి.ఎస్. లక్ష్మణ్ తర్వాత హైదరాబాద్ నుంచి వెలుగులోకొచ్చిన మరో యువ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడిదీ సరిగ్గా ఇదే పరిస్థితి. అసమాన ప్రతిభావంతుడిగా కెరీర్ ఆరంభంలోనే ప్రశంసలందుకున్నా..భారత జట్టు ద్వారాలు మాత్రం అంత సులభంగా తెరుచుకోలేదు. 2001-02 దేశవాళీ సీజన్‌లో హైదరాబాద్ తరపున అరంగేట్రం చేసిన రాయుడు..అనతికాలంలోనే తర్వాతి తరం సచిన్‌గా పేరొందాడు. మైదానం లోపలా, వెలుపల జరిగిన కొన్ని సంఘటనలు రాయుడి కెరీర్‌ను తిరోగమనంలోకి నెట్టేశాయి. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌తో గొడవ దీనికి మరింత ఆజ్యం అయ్యింది. 2005లో ఆంధ్రాకు రంజీల్లో ఆడినా..నిరుత్సాహకర ప్రదర్శన కారణంగా తర్వాతి ఏడాదే తిరిగి హెచ్‌సిఏ గూటికి చేరుకున్నాడు.

రాయుడి కెరీర్‌పై ప్రతికూల ప్రభావం చూపిన నిర్ణయం..రెబల్ క్రికెట్ లీగ్ ఐసీఎల్‌లో చేరటం. తన కంటే జూనియర్లందరూ టీం ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తుండగా..దేశవాళీలో రాణిస్తున్నా సెలక్టర్ల మెప్పు కొరవడటంతో రాయుడు రెబల్ క్రికెట్ లీగ్‌లో చేరాడు. దీంతో భారత క్రికెట్‌లో ఆడకుండా రెండేళ్ల పాటు నిషేధం విధించింది బిసిసిఐ. 2009లో ఐసీఎల్‌తో కాంట్రాక్ట్‌ను రద్దు చేసుకున్న అనంతరం మళ్లీ దేశవాళీ క్రికెట్‌లో పునరాగమనం చేసిన రాయుడు..బరోడా జట్టులో చేరాడు. బరోడా తరపున ఆడిన తొలి సీజన్‌లో 56.60 సగటుతో 566 పరుగులు బాదిన రాయుడు..తర్వాతి సీజన్‌లో 60.54 సగటుతో 666 పరుగులు సాధించాడు. 2012-13 దేవ్‌ధర్ ట్రోఫీలో టాప్ స్కోరర్‌గా నిలవటమే కాకుండా ఫైనల్స్‌లో నార్త్ జోన్‌పై అజేయంగా 78 పరుగులు చేసి జట్టుకు ట్రోఫీ అందించాడు.

ఐసీఎల్‌లో చేరటం కెరీర్‌కు ప్రతిబంధకం కాగా..బిసిసిఐ లీగ్ ఐపీఎల్ రాయుడికి క్రికెటర్‌గా జీవం పోసింది. ప్రతిభావంతుడైన క్రికెటర్‌గా సచిన్ మన్ననలు పొందిన తెలుగు తేజం..2010 నుంచి సచిన్ నేతృత్వంలోని (ప్రస్తుతం మెంటర్) ముంబయి ఇండియన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఐపీఎల్‌లో ఇప్పటివరకూ ఆడిన ఐదు సీజన్లలోనూ రాయుడు తనదైన ముద్ర వేశాడు. ఐపీఎల్ తర్వాత జరిగే ప్రతి భారత పర్యటనకూ రాయుడి పేరు వినిపించేదంటేనే అతడి ప్రదర్శన ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ట్వంటీ 20 సిరీస్‌లో బ్యాట్స్‌మన్ మనోజ్ తివారీ గాయంతో స్వదేశానికి రావటంతో..అతని స్థానంలో రాయుడిని ఎంపిక చేసింది సందీప్ పాటిల్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ. చీఫ్ సెలక్టర్‌గా ప్రతిభకే పట్టం కట్టిన ఘనత సాధించిన సందీప్ పాటిల్ కూడా ఐసీఎల్‌తో అనుబంధాన్ని కలిగి ఉన్నాడు. 2012లో శ్రీలంకలో జరిగిన టి20 ప్రపంచకప్ ప్రాబబుల్స్‌లో చోటు సాధించినా..తుది 15 మందిలో స్థానం పొందలేకపోయాడు. దేశవాళీ ప్రదర్శనతో భారత జట్టుకు ఎంపికవుతూ వచ్చినా..అంతర్జాతీయ అరంగేట్రానికి మాత్రం రాయుడు ఎదురుచూడక తప్పలేదు. 2013 జింబాంబ్వేతో వన్డే సిరీస్‌లో కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని గాయంతో జట్టులోకి వచ్చిన రాయుడు..జులై 24న తొలి వన్డే మ్యాచ్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో అజేయంగా 63 పరుగులు చేసిన రాయుడు స్టాండింగ్ కెప్టెన్ కోహ్లి (సెంచరీ చేశాడు)తో కలిసి జట్టుకు విజయాన్నందించాడు. జింబాంబ్వేపై తొలి మ్యాచ్‌లోనే హాఫ్ సెంచరీ సాధించి..అరంగేట్రంలోనే అర్థ సెంచరీ సాధించిన 12వ భారత ఆటగాడిగా నిలిచాడు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా (2013), న్యూజిలాండ్ (2014), ఆసియా కప్ (2014), 2014 టి20 ప్రపంచకప్‌లలో రాయుడు ఆడాడు. ఆసియా కప్‌లో పాకిస్తాన్‌పై అర్థ సెంచరీ సాధించినా, ఆ వెంటనే జరిగిన బంగ్లాదేశ్‌తో సిరీస్‌లో (3 మ్యాచ్‌ల్లో 18 పరుగులు) నిరాశపరిచాడు.

భారత్ తరపున 20 మ్యాచ్‌ల్లో ఆడినా..రాయుడి ప్రత్యేకత కనిపించలేదు. జట్టుకు ఉపయుక్తమైన ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికీ..మిడిల్ ఆర్డర్‌లో రహానే, రైనా, ధోనిల మెరుపులు ముందు రాయుడి ఇన్నింగ్స్ ప్రత్యేకత సంతరించుకోలేదు. అయితే మొతారే ఇన్నింగ్స్..అంబటి కెరీర్‌నే మార్చివేసింది. శ్రీలంకతో జరిగిన వన్డే మ్యాచ్‌లో తొలిసారి మూడోస్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రాయుడు..అజేయ శతకం సాధించాడు. ఈ ఒక్క సెంచరీ రాయుడుని జట్టులో ఉండేలా చేసింది. మిడిల్ ఆర్డర్‌లో నమ్మదగిన బ్యాట్స్‌మన్‌ను చేసింది. ఆ తర్వాత ఆఖరి వన్డేలోనూ అజేయంగా నిలిచి అర్థ సెంచరీ బాదాడు. దీంతో వన్డే జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవటమే కాకుండా 2015 ప్రపంచకప్ భారత జట్టులో చోటు సంపాదించాడు. జాతీయ జట్టులో చోటు కోసం సుదీర్ఘంగా దశాబ్ద కాలం ఎదురుచూసిన ఈ హైదరాబాదీ బ్యాట్స్‌మన్.. అబిద్ అలీ (1975), మహ్మద్ అజహరుద్దీన్, (1987, 1992, 1996,1999), వెంకటపతి రాజు (1992, 1996)ల తర్వాత ప్రపంచకప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నాల్గో క్రికెటర్‌గా ఘనత వహించాడు.

- శ్రీనివాస్ దాస్ మంతటి
సెల్ : 9676340133

సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి పెద్ద పండుగ. నిజానికి సంక్రాంతి అంటేనే సంబరాలు. సంబరాలంటే జోరు. హుషారు. సంక్రాంతికి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో ప్రత్యేకత. కోనసీమలో కోడి పందేలు, కేరళలో పడవ పోటీలు, తమిళనాడులో జల్లికట్టు, గుజరాత్‌లో గాలిపటాల ఉత్సవం...ఇవి కాక ముగ్గులు, పిండి వంటలు వుండనే వుంటాయి.

జల్లికట్టు జోష్

తమిళనాట కొన్ని వందల సంవత్సరాలుగా జల్లికట్టు సంప్రదాయం కొనసాగుతోంది. సంక్రాంతి మూడవ రోజైన 'మట్టు పొంగల్' నాడు దీనిని నిర్వహిస్తారు. ఇక్కడి ప్రజలు జల్లికట్టును వీరత్వం, పౌరుషానికి ప్రతీకగా భావిస్తారు. ఇది ఒళ్లు గగుర్పొడిచే క్రీడ కూడా. ముఖ్యంగా మధురైకి సమీపంలో వున్న పలమేడు, అలంగనల్లూర్ గ్రామాలలో మరింత ఉత్సాహభరింగా జరుగుతుంది. ముందుగా ఎద్దును వదిలే ప్రదేశం నుంచి కొంత దూరంలో ఒక గుర్తు పెట్టుకుంటారు. యువకులను తప్పించుకుని ఆ గుర్తు దాటి ముందరకు వెళ్లిపోతే ఎద్దు గెల్చినట్టు. అలా కాకుండా కుర్రాళ్లు గిత్త మీదకు దూకి మోపురం పట్టుకుని దాన్ని లొంగదీసుకుని ఆపినట్టయితే కుర్రాళ్లు గెల్చినట్టు. జల్లికట్టులో పాల్గొనే ఎద్దులను పొలం పనులకు ఉపయోగించరు. అవి కేవలం జల్లికట్టుకే పరిమితం. వాటికి ప్రత్యేకమైన ఆహారం, శిక్షణ వుంటుంది. మీదకు వచ్చిన వారిని తమ వాడి కొమ్ములతో విసిరేయడం, కాలు దువ్వడం, కోపంతో బుస కొట్టడం వంటివి నేర్పిస్తారు. పద్దెనిమిదేళ్లు నిండిన వారెవరైనా ఈ జల్లికట్టులో పాల్గొనవచ్చు. పోటీలో గెలుపొందినవారికి నగదు బహుమతి, నగలు, పట్టు వస్త్రాలు, రిఫ్రిజిరేటర్లు, బీరువాలు, వాచీలు...వంటి విలువైన బహుమతులు అందుతాయి. పనిలోపనిగా పెద్ద మొత్తంలో బెట్టింగుల జోరూ వుంటుంది. బరిలో వున్న ఎద్దును బట్టి, దాన్ని లొంగదీయాలని చూసే కుర్రకారు పట్టుని బట్టి బెట్టింగు మొత్తం పెరుగుతుంది. బుసలు కొట్టే గిత్తలకు, ఉడుకురక్తం ఉరకలెత్తే యువతకు మధ్య జరిగే జల్లికట్టు చూడ్డానికి జనం వేలాదిగా విచ్చేస్తారు. విదేశీయులు సైతం జల్లికట్టును తిలకించడానికి ఉత్సాహం చూపిస్తారు.

గాలి పటమా పద... పద...

గుజరాత్‌లో సంక్రాంతి పండుగకు మరో ప్రత్యేకత కూడా వుంది. అదే గాలి పటాల పండుగ. దానికి దేశదేశాలనుంచి కైటిస్టులు (గాలిపటాలను ఎగురవేసేవారు) విచ్చేస్తారు. ఆ పండుగను తిలకించడానికి ... ఉద్యోగ, వ్యాపారార్థం వివిధ రాష్ట్రాలలో నివసించే గుజరాతీలు సైతం పండుగనాటికి స్వస్థలం చేరుకోవాలని ఉవ్విళ్లూరుతుంటారు. పండుగ నాడు పిల్లాపెద్దా అన్న తేడాల్లేకుండా అంతా గాలిపటాలు ఎగురవేస్తారు. రాత్రింబగళ్లు ఆకాశంలో పతంగులు వయ్యారంగా ఎగురుతూనే వుంటాయి. అహ్మదాబాద్, సూరత్, వడోదర, రాజ్‌కోట్ వంటి ప్రాంతాల్లో సంక్రాంతి పండుగనాడు కొందరు వంట సామగ్రిని తీసుకుని మిద్దెల మీదకి చేరుకుంటారు. ఆకాశంలో ఎగిరే గాలిపటాలను చూస్తూ వంట పని పూర్తిచేస్తారు. ఎవరైనా వేరొకరి పతంగిని తెంపినప్పుడు ఆనందంతో చప్పట్లు చరుస్తారు. తీపి మిఠాయిలు, కిచిడి, మజ్జిగ తప్పకుండా ఆరగిస్తారు. సంక్రాంతినాడు జరిగే అహ్మదాబాద్ ఇంటర్నేషనల్

కైట్ ఫెస్టివల్‌కు ప్రపంచ వ్యాప్తంగా పేరుమోసిన కైటిస్టులు వస్తారు. గత రెండు దశాబ్దాలకు పైగా గుజరాత్‌లో ఈ పండుగను జరుపుకుంటున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలోగానీ పోలీస్ స్టేడియంలోగానీ ఈ ఉత్సవాన్ని కన్నుల పండుగ్గా నిర్వహిస్తారు. ఇక్కడకు వచ్చే చిత్రవిచిత్రమైన పతంగులను చూచి ఆనందపడాలేగానీ వర్ణించలేం. ఇక్కడ పోటీలు కేవలం గాలిపటాలు ఎగురవేయడంలోనే వుండవు. ఫారిన్ పెయింటెడ్ కైట్, ఫారిన్ కొలాజ్ వర్క్, మినియేచర్ కైట్స్, ఇండియన్ ఫైటర్ కైట్స్, వర్క్‌మన్ షిప్ వంటి రకరకాల విభాగాల్లో పోటీ వుంటుంది. జడ్జీలు స్టేడియం అంతా తిరిగి చూస్తూ విజేతలను ఎంపికచేస్తారు.

కో...అంటే ... కోడి పందెం!

కోస్తా జిల్లాల్లో సంక్రాంతి వచ్చిందంటే చాలు! కోళ్ల పందేల సందడే సందడి. యుద్ధానికి సన్నద్ధమయ్యే సంతోషంతో పందెం రాయుళ్లు చాలా ఉత్సాహంగా కనిపిస్తారు. సంవత్సరం పాటు చేసిన సన్నాహాలకు ఆఖరి వ్యూహాలు రచిస్తూ వుంటారు. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి, ఖమ్మం, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు రంజుగా సాగుతాయి. పోలీసులు వద్దన్నా, దాడులు చేసినా మారుమూల ప్రాంతాల్లో, తోటల్లో పందేలు గుట్టుగా సాగిపోతాయి. దాదాపు వందల కోట్ల మేర సొమ్ము చేతులు మారుతుంది. రాజకీయ ప్రముఖులు, సినీ తారలూ ఈ పందేల్లో పాల్గొంటారు. ఆనవాయితీ, సాంప్రదాయం, సంక్రాంతి సరదా అనే పేరిట కోడిపందేలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. మంత్రులూ, ఎమ్మెల్యేలూ రాజధాని నుంచి ప్రత్యేకంగా పోలీసులపై ఒత్తిడి తెస్తారు. చాలా చోట్ల ఎమ్మెల్యేలు కోళ్ల పందాలను ప్రారంభించటం ఒక విశేషం. ఖరీదైన పందాలకు పశ్చిమ గోదావరి పెట్టింది పేరు. ఈ ఒక్క జిల్లాలోనే పండుగ రోజుల్లో వందల కోట్లల్లో జూదం నడుస్తుందని అంచనా! ◆

◆ సమ్‌థింగ్ స్పెషల్

వింత పెళ్లి-ఆస్తుల గోల

ప్రపంచ వ్యాపితంగా అమర ప్రేమల కథలకు కొదవ లేదు. వాటిలో విలన్లు ఎక్కువగా తలిదండ్రులు, రాజులు, దుష్ట నాయకులే మనకు కనిపిస్తారు. కానీ మనం చెప్పుకోబోయే వాస్తవ కథలో విలన్లు వారు కాదు. వాళ్లు కాకపోతే మరెవరు? ఇంతకీ కథ సుఖాంతమైందా? లేదా?

'ఆమె కోసమే అతను జీవించాడు, అతని కోసమే ఆమె బతికింది, నిజానికి వారిది ఈ శతాబ్దపు ప్రేమ కథ' అంది రెబెకా రైట్. వారు ఒకరినొకరు ఎలా పట్టించుకొనే వారో చూసిన వారికి తప్ప ఇతరులు అర్ధం చేసుకోవటం కష్టం అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.

రీలును వెనక్కు తిప్పితే కోడెగాడి పేరు ఎడ్డీ హారిసన్, అతగాడి ప్రియురాలు ఎడిత్ హిల్. పది సంవత్సరాల పాటు ప్రేమించుకున్న తరువాత గతేడాది జూన్‌లో వారు వివాహం చేసుకున్నారు. ఏడాది కూడా గడవక ముందే ఆ జంటను కుటుంబ సభ్యులు విడదీశారు.

ఏ ముహూర్తాన వారు వివాహం చేసుకున్నారో గానీ అది చెల్లదంటూ ఎడిత్ కుటుంబ సభ్యులు కోర్టుకు ఎక్కారు. కొన్ని సంవత్సరాల క్రితమే చట్టబద్దంగా ఎడిత్ అశక్తురాలుగా ప్రకటించబడినందున వారి వివాహం చెల్లదని, ఆమె ఆస్తి పంపకం వివాదంలో పడుతుందంటూ, అసలు తమకు తెలియకుండా వివాహం జరిగిందంటూ కుటుంబ సభ్యురాలు పాట్రిసియా బర్బర్ వాదించింది. అయినా సరే తాము కలిసి ఉండక తప్పదని ఆ నూతన దంపతులు మొండికేశారు. వివాహం చట్టవిరుద్ధంగా జరిగినందున చెల్లదని చెబుతూనే ఎడిత్ పరిస్థితి దృష్టా వెంటనే వివాహాన్ని రద్దు చేయటం కుదరదని అందువలన ఆమె బాగోగులు చూసేందుకు కుటుంబ సభ్యులకు బదులు జెస్సికా అనే న్యాయవాదిని సంరక్షకురాలిగా కోర్టు నియమించింది. ఈ లోగా దంపతులను వేరు చేయటానికి ఉన్న అవకాశాలను పరిశీలించి తెలియచేయాలని, తరువాత విడాకుల గురించి నిర్ణయించవచ్చని సెప్టెంబరులో కోర్టు ఆదేశించింది. ముందు ఎడిత్ ఆస్తి అన్యాక్రాంతంగా చూడటం, ఇతర ఇబ్బందులేమీ లేకపోతే దంపతులు కలసి ఉండేందుకు వీలును పరిశీలిస్తున్నట్లు సంరక్షకురాలు చెప్పారు.

ఈ క్రమంలో డిసెంబరు ఆరున కోర్టు నియమించిన సంరక్షకురాలు ఎడిత్ హిల్‌ను రెండు వారాల పాటు ఫ్లోరిడాలోని బర్బర్ ఇంటికి తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించింది. ససేమిరా తన భర్తను వదలి వచ్చేది లేదని ఎడిత్ తేల్చిచెప్పింది. దాంతో పోలీసులను పిలవాల్సి వచ్చింది. నలభై నిమిషాల పాటు నచ్చచెప్పిన తరువాత ఒప్పుకుంది.

అసలు ఇంతకూ ఆ కొత్త దంపతుల ప్రేమ లత ఎలా అల్లుకుందో చెప్పలేదు కదూ ! ఫక్తు హాలీవుడ్ సినిమా ఫక్కీలో జరిగింది. పది సంవత్సరాల క్రితం వారు ఒక రోజు లాటరీ టిక్కెట్లు కొనేందుకు ఒకే క్యూలో నిలబడినపుడు చూపులతో పాటు మాటా మాటా కలిసింది. వారిలో ఒకరికి తరువాత రెండున్నరవేల డాలర్ల లాటరీ బహుమతి కూడా వచ్చింది. అలా బంధం మరింత బలపడింది. వివాహం చేసుకుంటే ఎదురయ్యే ఆటంకాల గురించి ఆలోచించి, ఆలోచించి చివరకు ఏం జరిగితే అది జరుగుతుందని తెగించారు. ఒక రోజు పాతబడిన ఒక చర్చిని చూసుకొని 95 ఏళ్ల పూజారి సమక్షంలో గతేడాది ఒకటయ్యారు. ఇది తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు కోర్టుకెక్కారు.

పోలీసుల సమక్షంలో కుదిరిన ఒప్పందం ప్రకారం రెండు వారాల తరువాత ఎడిత్ భర్త హారిసన్ వద్దకు తిరిగి రాలేదు. ఇక ఆమె తిరిగి రాదని అతగాడికి అర్ధమైంది. బలహీనమైన హృదయం ముక్కలైంది. దానికి తోడు ఫ్లూతో జబ్బు పడ్డాడు. చికిత్సకోసం ఆసుపత్రిలో చేర్చారు. ఫ్లూ, మనోవ్యాధితో అంతిమ శ్వాస విడిచాడు. ఇది తెలిసి ఎడిత్ తల్లడిల్లి పోయింది. కుటుంబ సభ్యుల ఆమోదం లేని ఆ వివాహం ఎందుకు చేసుకున్నారని హారిసన్‌ను అడిగితే నాకు ఒక తోడు అవసరం నాకు ఆమె సాయ పడితే నేను ఆమెకు సాయం పడవచ్చనుకున్నాను అన్నాడు. మేం ఇద్దరం ఒంటరే కనుక ఒకరికి ఒకరు తోడు ఉండవచ్చనుకున్నాం, ముందు ఇద్దరం మంచి స్నేహితులమయ్యాం అంది ఆమె. వారు నిజంగా ప్రేమలో పడ్డారు. అందుకే అతని కారణంగా ఎడిత్ రోజూ పొద్దున్నే లేచేది అని రెబెకా రైట్ కుమార్తె రాబిన్ రైట్ వ్యాఖ్యానించింది.

హారిసన్ మరణించాడు కనుక ఎడిత్‌కున్న ఆస్తి కుటుంబ సభ్యులకే దక్కుతుంది. అయితే ఎవరికి అన్న విషయంలో ఇద్దరు అక్కా చెల్లెళ్లు కోర్టుకు ఎక్కారు. ఇప్పటివరకు లేని అంత పెద్ద కూతుళ్లు ఎక్కడి నుంచి వచ్చారన్న అనుమానం వచ్చింది కదూ. ఇదే ఆ కథలో ట్విస్టు. ఎడిత్‌కు ఎప్పుడో పెళ్లయింది. భర్త మరణించాడు. హారిసన్‌కు 18 ఏళ్ల వయస్సులో 26 ఏళ్ల యువతితో వివాహమైంది. కొద్ది నెలల్లోనే విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి వంటరే. ఆ క్రమంలో వారిని లాటరీ టిక్కెట్ కలిపింది. కుదరదంటూ కూతురే కోర్టుకు ఎక్కింది. అసలు విషయం ఇక్కడే ఉంది. ఇంతకూ చెప్పలేదు కదూ ! అతడి వయస్సు 95, ఆమె వయస్సు 96.

ట్విస్టు మీద ట్విస్టు మరొకటుంది. అతను శ్వేత జాతీయుడు, ఆమె నల్లజాతీయురాలు. గతంలో ఉన్న చట్టాల ప్రకారం వర్జీనియాలో అంతరజాతుల వివాహం నిషిద్ధం. అందువలన వారు తమ 20,30,40 ప్రాయాల్లో కలుసుకొని ఉన్నప్పటికీ వారి వివాహం చట్టవిరుద్దమై ఉండేది. ఇప్పుడా చట్టం లేకపోయినా వయస్సు కారణంగా అది చెల్లుబాటు కాలేదు. తన తల్లి కంటే ఇంకా పెద్ద వయస్సులో ఎవరైనా వివాహం చేసుకున్నారా అన్న విషయాన్ని గిన్నిస్ రికార్డులను పరిశీలిస్తున్నామని లేకుంటే అమెరికాలో అంత పెద్ద వయస్సులో అంతర జాతుల వివాహం చేసుకున్న జంటగా రికార్డులకెక్కుతుందని కుమార్తె రెబెకా అంటోంది.

- సత్య

◆ కథ



రేచీకటి అల్లుడు

ఎ.కె.రామానుజన్

ముసలి వితంతువు ఒకావిడకు ఒక్కడే కొడుకు. అతనికి రాత్రిపూట చూపు సరిగా ఆనదు. ఈ విషయం ఎవరికైనా తెలిస్తే అతనికి పిల్లనెవరూ ఇవ్వరని... ఆ సంగతిని దాచి పెట్టి, ఆమె తన కొడుక్కి ఒక మంచి కుటుంబంలోని పిల్లను చూసి పెళ్లి చేసింది. "తర్వాత కోడలికి తెలిసినా ఏమీ అనదు. ఎటొచ్చీ ఈ సంగతిని ఆ పిల్ల పుట్టింటివారికి మాత్రం తెలియనివ్వకూడదు" అనుకున్నది గడుసు ముసలమ్మ.

పెళ్లైన తర్వాత సంక్రాంతి పండగ వచ్చింది. పండక్కి కొత్త అల్లుడిని ఆహ్వానించారు అత్తింటివారు. గడుసు ముసలమ్మ కొడుకును ముందుగానే హెచ్చరించింది. "జాగ్రత్తరా నాయనా! చీకటి పడిందంటే నీకు ఏ వస్తువూ కనబడదు. అందుకని చీకటి పడ్డ తర్వాత బయట తిరక్కు. పగటిపూట మాత్రమే ప్రయాణించు. మీ మామగారింట్లో ఒక్క రాత్రి మించి ఉండకు. ఉన్నావంటే అసలు నిజం బయటపడిందంటే మనల్ని ఇక పూచీపుల్లని చూసినట్టు చూస్తారు" అని.

చీకటి పడక ముందే అత్త గారింటికి చేరుకోవాలనే తొందర కొద్దీ అల్లుడు చాలా వేగంగానే ప్రయాణించాడు. కానీ ఆ ఊరి పొలిమేరలు చేరే సరికి చీకటి పడింది. రేచీకటి అల్లుడికి ఇప్పుడు ఇక ఏమీ కనిపించటం లేదు. తల్లి ఉపదేశాన్ని గుర్తుకు తెచ్చుకొని, తడుముకుంటూనే అతను ఒక ఎత్తైన స్థలాన్ని చేరుకొని, అక్కడే కూర్చుండిపోయాడు ఎలాగో ఒకలా రాత్రి గడిస్తే చాలు' అనుకుంటూ.

అయితే దురదృష్టం కొద్దీ, అతను కూర్చుండిన ఆ స్థలం మరేదో కాదు అతని అత్తింటివారి పేడ దిబ్బనే! అల్లుడు అలా కూర్చున్నాడో లేదో, అత్తగారు ఆ నాటి చెత్తాచెదారం, పేడ అన్నీ తీసుకొచ్చి దిబ్బలోకి వేసేసింది. అది సూటిగా అల్లుడి నెత్తిమీదే పడింది.

అకస్మాత్తుగా తల మీద ఏదో వచ్చి పడేసరికి భయపడ్డ అల్లుడు "అయ్యో!" అని అరిచాడు. అత్తగారు నిర్ఘాంతపోయి చూస్తే ఏముంది? అక్కడ తమ గౌరవనీయులైన అల్లుడుగారు ఉన్నారు. అతని వంటి నిండా పేడ, చెత్త చెదారం కొట్టుకుపోయున్నాడు. "కొత్త అల్లుడ్ని ఎంత గౌరవంగా చూసుకోవాలి. అయ్యో ఎంత అపచారం జరిగిపోయింది" అని అత్తగారు మనస్సులో తెగ బాధపడిపోతుంది. పశ్చాత్తాపంతో ఆమె తన ముఖాన్ని చీర చెంగులో దాచుకొని, ఇంటికి పరిగెత్తింది.

దారిలో ఆమెకు తన చిన్న కొడుకు పదేళ్లవాడు కనబడ్డాడు. బర్రెల్ని వాడు ఇంటికి తోలుకు పోతున్నాడు. ఆమె గబగబా వాడి దగ్గరకు పోయి "ఒరే, చూడు, మీ కొత్త బావ వచ్చాడు. కానీ ఎందుకో మరి, ఆయన మన పేడ దిబ్బలో కూర్చుని ఉన్నాడు. మూత్ర విసర్జనకు వెళ్లి ఉంటాడు బహుశా! అయితే నేను ఆయన్ని గమనించకుండా చెత్త, పేడ అంతా ఆయన నెత్తినే కుమ్మరించాను. ఆయన చాలా కోపగించుకొని ఉంటారు. నువ్విప్పుడు వెంటనే పరిగెత్తుకెళ్లి ఎలాగోలా ఆయన్ని శాంతపరిచి, ఒప్పించి, మెల్లగా మనింటికి తీసుకురా. ఆయనకి నువ్వంటే ఇష్టం. నీ మాట కాదనడు" అన్నది.

పిల్లవాడికి కూడా కొత్త బావ అంటే చాలా ఇష్టం. వాడు "ఓ బావా ఎక్కడున్నావు నువ్వు?" అని దారంతా అరుచుకుంటూ పరిగెత్తాడు. వాడు వెళ్లేసరికి, బావ ఇంకా పేడదిబ్బలోనే కూర్చుని ఉన్నాడు.

"నువ్విక్కడ ఎందుకు కూర్చుని ఉన్నావు? రా, మన ఇంటికి పోదాం" అని వాడు బావ చేయి పట్టుకొని లాగాడు. కొత్త బావకి రేచీకటి ఉన్నది తప్పిస్తే, తెలివి బాగానే ఉన్నది. అతనన్నాడు– "నేనిక్కడ ఊరికే కూర్చోలేదురా బాబూ! మీ దిబ్బలోంచి ఎన్ని బళ్ల ఎరువు అవుతుందో లెక్కగడుతూ ఉన్నాను. ఒకటి రెండెకరాలకు సరిపడా ఎరువు ఉంది ఇక్కడ" అలా అంటూనే అతను ఆప్యాయంగా పిల్లవాడి భుజంపై చేయి వేసి అతనితో పాటు నడవటం మొదలుపెట్టాడు. కొంచెం దూరం పోయేసరికి బర్రెలు అతని కళ్ల ముందు మసకమసకగా భూతాల మాదిరి కనబడ్డాయి. "ఓయ్! ఇవేమిటి?" అని అడిగాడతను. "అవి మన బర్రెలే. నేను వాటిని మేపటం కోసం అడవికి తీసుకెళ్లాను. ఇప్పుడు ఇంటికి తిరిగి వస్తున్నాయి" అన్నాడు బావమరిది.

"ఓహో...బాగున్నాయి. బాగున్నాయి. పెద్దగా ఆరోగ్యంగా బలిష్టంగా ఉన్నాయి" అన్నాడు కొత్త అల్లుడు ఒక బర్రెను అదిమి, దాని తోకను చేతిలోకి తీసుకుంటూ. ఇక ఆ పైన అతను బర్రె తోకను ఆధారంగా పట్టుకొని ధైర్యంగా నడవటం మొదలుపెట్టాడు ఏమీ కనబడకపోయినా.

దారి చూపే ఆ బర్రె ధాన్యం నిలువచేసే కల్లాల పక్కనుండి పోతుండగా, కాలుజారి నేరుగా ధాన్యపు కల్లంలో కొత్తల్లుడు పడిపోయాడు. "ఏమైంది మీకు. చూపు సరిగ్గా ఆనదా ఏమిటి బావా" అని అడిగాడు బావమరిది కొంచెం అనుమానంగా. "అయ్యో నాకు బాగానే కనిపిస్తుంది. మీ ధాన్యపు కల్లం ఎంత లోతున్నదో చూడాలని ఇందులోకి దూకాను అంతే. మా ఇంట్లోకి కూడా ఇలాంటిదే ఒకటి చేయిద్దామనుకుంటున్నాను. సరే ఇప్పుడు ఓసారి చేయి అందించు, అదీ అలాగ నువ్వు మంచి బావమరిదివోయ్" అంటూ రేచీకటి అల్లుడు మళ్లీ నేల మీదకి ఎగబాకాడు. ఇక అక్కడ అతనికి ఒక గోడ దొరికింది. ఆ గోడను ఆధారంగా చేసుకొని, దాన్ని వదలకుండా పట్టుకొని నడవటం మొదలుపెట్టాడు. అది చూసిన బావమరిది "బావా ఇదేంటి నువ్వు ఇట్లా గోడను పట్టుకొని గోడ వెంటే నడుస్తున్నావు. నీ కళ్లు సరిగ్గానే కనబడుతున్నాయి కదా బావా" అడిగాడు చిన్న బావమరిది.

"ఛ, ఛ! నువ్వేం మాట్లాడుతున్నావు? ఏదో

ముచ్చట కొద్దీ మీ ఇంటి ప్రహరీగోడ ఎంత పొడవున్నదో కొలుస్తున్నాను నేను" అని సర్దుకున్నాడు అల్లుడు. ఇంటి వాకిట్లోనే అత్తగారు గొర్రె పొట్టేలును ఒకదాన్ని కట్టివేసి ఉంచారు. బావా బావమరుదులు ఇద్దరూ ఇంటికి చేరుకోగానే హడావుడిగా లోనికి పోబోయిన అల్లుడు, నేరుగా ఆ పొట్టేలు మీదికే ఉరికాడు. ఏమీ అర్థం కానట్లు చెలరేగి, కొమ్మలతో పొడిచి పొడిచి వదిలించి ఆ పొట్టేలు, కొత్త అల్లుడనైనా చూడకుండా.

కొత్తబావ అరుస్తూ కిందపడిపోగానే బావమరిది పొట్టేలును గట్టిగా ఓ దెబ్బ వేసి తరిమాడు. ఆపైన, బావగారికి లేచేందుకు చేయి అందిస్తూ "అక్కడ పొట్టేలు ఉండగా చూసుకోలేదా బావా?" అని అడిగాడు.

"ఓహ్, నేను దాన్ని చూడకేం? దాని వాలకం నచ్చి, ఓసారి గట్టిగా రుద్ది ముద్దు చేద్దామనుకున్నాను. కానీ చూడు, అది ఏం చేసిందో! కొత్త వాళ్లతో ఇలా ప్రవర్తించమని నేర్పిస్తారా, మీరు?" అన్నాడు అల్లుడు.

ఆ పాటికి చీకటి పడిపోయింది. అందరూ నేల మీద వరసగా భోజనాలకు కూర్చున్నారు. వాళ్ల ముందు పీటల మీద వడ్డించిన విస్తళ్లున్నాయి. కొత్త అల్లుడు ఇంటికి వచ్చిన ప్రత్యేక సందర్భం కనుక స్వయంగా అత్తగారే వంగి వడ్డిస్తున్నారు. ఆవిడ లేచి నిలబడ్డప్పుడూ, వంగినప్పుడూ, నడిచినప్పుడూ, అడుగు అడుగుకూ ఆమె ధరించిన వెండి ఆభరణాలు ఘల్లు ఘల్లుమంటున్నాయి. అల్లుడిని అకస్మాత్తుగా భయం ఆవరించింది. "ఇందాక తనను కుమ్మిన పొట్టేలు, ఎలా వచ్చిందో మరి, మళ్లీ ఇక్కడికి వచ్చింది– తనను కుమ్మబోతున్నది" ఈ ఆలోచన వచ్చిన మరుక్షణం విస్తరి కింద ఉన్న పీట అల్లుడి చేతిలోకి వచ్చేసింది. అతను దాన్ని గిరగిరా తిప్పి తన ముందుకొచ్చి నిలబడ్డ ఆకారం మీదికి విసిరాడు బలంగా. అత్తగారు కీచుమంటూ వంటగదిలోకి పరిగెత్తింది. దాన్నించి తప్పించుకునేందుకు. తను సాయంత్రం చెత్త, పేడ వేసినందుకుగాను అల్లుడు తనపై కోపగించుకుంటున్నాడని ఆవిడ అనుకుంది.

ఇక "తన భార్య కాకుండా అత్తగారు వడ్డించినందుకు బావ నొచ్చుకున్నాడని మిగిలిన బావమరుదులు అనుకున్నారు. వెంటనే అతని భార్య బయటికి వచ్చి, మిగిలిన వడ్డనంతా నిర్వహించి, అయిందనిపించింది.

భోజనాలైనాక అందరూ వేర్వేరుచోట్ల పడుకునేందుకు వెళ్లిపోయారు. అల్లుడు, కూతురు పడుకునేందుకు ఒక చిన్న గదిని కేటాయించారు. చిన బావమరుదులంతా బయట వరండాలో పడుకున్నారు. మధ్యరాత్రి అల్లుడుగారికి మెలుకువ వచ్చింది. "మూత్రాశయం నిండిపోయింది. ఖాళీ చేసుకోనిదే పని జరగదు" కానీ ఎలాగ?

అత్తగారింటిని తనకు గుర్తున్నంతమేర గుర్తుకుతెచ్చుకుని, గోడలు పట్టుకొని కొలుచుకుంటూ, అతి కష్టం మీద స్నానాల గదిని కనిపెట్టి, పని కానిచ్చాడు. అయితే ఎంత గుర్తుపెట్టుకుందామనుకున్నా నిద్రమత్తులో వెనక్కి రావటంతో దారితప్పి, తమ గదికి బదులు అత్తగారు– మామగారు పడుకున్న గదిలోకి చేరాడు. తడుముకుంటుండగా అతని చేతికి అత్తగారి కాళ్లు దొరికాయి. భార్య కాళ్లే అనుకున్నాడతను, పాపం.

కాళ్లనెవరో పట్టుకొనే సరికి అత్తగారికి గబుక్కున మెలుకువ వచ్చింది. ఆమె కెవ్వున అరిచింది 'ఎవరది?'అని.

"నేను, నేను" అన్నాడు కొత్తల్లుడు.

"ఇంత రాత్రి పూట ఇక్కడేం చేస్తున్నావు?" అన్నది ఆవిడ.

అల్లుడికి తన తప్పు అర్థమైంది ఈపాటికి. "అబ్బే, మరేంలేదు. మీరు అన్నం వడ్డిస్తుండగా నేను మీ మీదకి పీట విసిరేశానుగదా, అందుకు నేను చాలా చింతిస్తున్నాను. మీరు నన్ను క్షమించాలి. నేను మీ కాళ్లు పట్టుకొని క్షమాపణ అడగాలనుకున్నాను, అడిగాను. అంతే. నా వల్ల తప్పు జరిగింది. క్షమించండి" అన్నాడతను.

అల్లుడి మాటలు విని అత్తగారికి మరింత సిగ్గేసింది. "అయ్యో ఏమీ ఫరవాలేదులే. వెళ్లి పడుకోండి" అన్నది.

కానీ అల్లుడు ఆమె కాళ్లు వదలలేదు. "నన్ను క్షమించాలి. క్షమించాల్సిందే" అంటున్నాడు కళ్లు మూసుకొని, తల ఊపుకుంటూ.

ఆ సరికి భార్య మేలుకున్నది. "అయ్యో! ఈయన రాత్రి పూట ఒంటేలుకని లేచి, వెళ్లి మా అమ్మను లేపి మాట్లాడుతున్నాడు. ఇరుగు పొరుగు వాళ్లు ఏమనుకుంటారు?" అని ఆమె లేచి వచ్చింది. "పద, పద మనం ఈ సంగతులన్నీ తెల్లవారాక మాట్లాడుకుందాం. ఇప్పుడు పడుకోవాలి, పద" అని రెక్క పట్టుకొని తమ గదిలోని లాక్కుపోయింది.

రాత్రి గడిచి తెల్లవారేసరికి అల్లుడి కష్టాలన్నీ తీరాయి. కొత్త అల్లుడి ఠీవీ, దర్పం తిరిగి వచ్చేశాయి. ఇంట్లో వాళ్లందరి ముఖాలూ కళకళలాడాయి. అందరినీ మురిపించి, ఇంకా సాయంత్రం కాకుండానే ఎవ్వరెంత చెప్పినా వినకుండా ఇంట్లో పనులున్నాయని చెప్పి బయలుదేరాడు కొత్తల్లుడు. చీకటి పడితే వేరే ఎక్కడ ఆగినా ఫరవాలేదు. ఇంకొక్క రాత్రిని ఇక్కడ గడిపేదెలాగ, మరి?

(రేచీకటి అల్లుడి కథ మన తెలుగుదే. కోస్తా ప్రాంతంలో ఒకప్పుడు బాగా వినిపించిన ఈ కథ, ఏ కారణం వల్లనో చాలా మందికి అందకుండా పోయింది. రచయిత దీన్ని సేకరించి గ్రంథస్థం చేశారు. ఆయనకు ధన్యవాదాలతో , ఈ కథ మీకోసం.)

◆

నవల, కథ, కవితల పోటీ

సిపిఎం 21వ అఖిలభారత మహాసభల సందర్భంగా ఉత్తమ సాహిత్యాన్ని ప్రోత్సహించేందుకై నవలలు కథలు కవితల పోటీ నిర్వహించాలని ఆహ్వానసంఘం నిర్ణయించింది. ప్రజా శ్రేయస్సు సామాజిక చైతన్యం కోరే రచయితలు కవులూ ఈ పోటీలలో పాల్గొని ఉత్తేజకరమైన రచనలు పంపి ఈ ప్రయత్నం జయప్రదం చేయాలని కోరుతున్నాము. నవల: ప్రథమ బహుమతి రూ.30,000/–, ద్వితీయ బహుమతి రూ.20,000/–, తృతీయ బహుమతి రూ.10,000/– కథ: ప్రథమ బహుమతి రూ.10,000/–, ద్వితీయ బహుమతి రూ.5000/–, తృతీయ బహుమతి రూ.3000/– కవిత: ప్రథమ బహుమతి రూ.3000/–, ద్వితీయ బహుమతి రూ.2000/–, తృతీయ బహుమతి రూ.1000/–

నిబంధనలు/సూచనలు: ◆ కథకు సంబంధించి ఎ4 సైజు కాగితంపై చేతిరాతలో 8 పేజీలు ఉండాలి. డి.టి.పి. 15 సైజు ఫాంట్‌లో ఎ4 సైజులో 5 పేజీలకు మించకూడదు. ◆ మరీ సుదీర్ఘ కవితలు పంపనవసరం లేదు. ◆ నవల ఎ4 సైజు కాగితంపై చేతిరాతలో 250 పేజీలు ఉండవచ్చు. డి.టి.పి. అయితే 15 సైజు ఫాంట్‌లో ఎ4సైజులో 150 పేజీలకు మించకూడదు. ◆ ఇటీవలి ప్రపంచీకరణ విధానాల నేపథ్యంలో ప్రజల జీవితాలలో వస్తున్న మార్పులకు సంబంధించిన అంశాల్ని ఇతివృత్తంగా స్వీకరించవచ్చు. ఇతివృత్తంతో పాటు రచనా శిల్పానికి అధిక ప్రాధాన్యత ఉంటుంది. ◆ అచ్చయినవి, అనుకరణలు, అనువాదాలు పోటీకి అనర్హం. ఆ మేరకు హామీపత్రం రాయాలి. ◆ రచనలను కవరుపై నవల, కథ, కవితల పోటీకి అని రాసి 'మహాసభల ఆహ్వాన సంఘం, ప్లాట్ నెం. 21/1, యం.హెచ్. భవన్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్– 500 020 చిరునామాకు పంపించాలి. ◆ ఈమెయిల్ psbhap@gmail.com ద్వారా కూడా పంపించవచ్చు. ◆ డి.టి.పి.చేసిన వాటిని పిడిఎఫ్, ఓపెన్ ఫైల్ రెండూ పంపించాలి. ◆ ఫలితాలకు సంబంధించి న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం. ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండవు. ◆ రచనలు చేరవలసిన చివరి తేది: మార్చి 10. ◆ గెలుపొందిన నవలలు ప్రచురించడం జరుగుతుంది. ◆ పోటీకి అందిన కథలు, కవితలలో గెలుపొందిన వాటితో పాటు, సాధారణ ప్రచురణకు ఎంపిక చేసిన వాటితో కథ, కవితా సంకలనాలను ప్రచురించడం జరుగుతుంది. ◆ బహుమతి పొందిన కథలు, కవితలను ప్రస్థానం, ప్రజాశక్తి దినపత్రిక ఆదివారం సంచికలలో ప్రచురించడం జరుగుతుంది. ◆ విశాఖపట్నంలో ఏప్రిల్ 14 నుండి 19 వరకు జరిగే మహాసభల సాహిత్య వేదికపై బహుమతులు అందజేయడం జరుగుతుంది. ఇతర వివరాలకు 9490099059 ద్వారా సంప్రదించవచ్చు.

కొత్తగా...!

◆ టెక్ గురు

పిల్లలు బడి అయిపోయాక నేరుగా ఇంటికి వస్తున్నారో లేదో తెలుసుకోవాలి. కానీ పట్టించుకునే సమయం ఉండదు. ఫర్వాలేదు మీకు బేబీ సిట్టర్ సహాయం చేస్తుంది. వేల రూపాయలు పోసి కొన్న స్మార్ట్ ఫోన్ మోత బరువుగా ఉందా. అయితే ఆ సమస్య తీర్చడానికే ఉలెన్ గ్లౌజ్ ఒకటొచ్చింది. కమ్మని సంగీతం వినిపించి నిద్రపుచ్చే దిండు గురించి మీకు తెలుసా. ఇంకా ఇలాంటి ఎన్నో సాంకేతిక మాయాజాలాలు మార్కెట్లోకి వస్తున్నాయి. వాటి వివరాల్లోకెళితే.....

బేబీ సిట్టర్

నాలుగు పోబ్‌కీ సెన్సార్‌లు కలిగిన ఒక చిన్న తెల్లటి బొమ్మే ఈ వర్చువల్ బేబీ సిట్టర్. పని ఒత్తిడిలో పడిపోయి పిల్లల సంరక్షణ పట్టించుకోలేకపోతున్నాము అనుకునే వారికి ఇదొక వరం. ఈ నాలుగు సెన్సార్లలో ఒకటి పిల్లల స్కూల్ బ్యాగ్‌లో ఉంచితే చాలు వారు ఇంటికి చేరుకోగానే మెయిల్‌కి కానీ, ఫోన్‌కి కానీ మెసేజ్ వచ్చేస్తుంది. తెల్లటి బొమ్మకి ఆ నాలుగు సెన్సార్లు కనెక్ట్ చేయబడి ఉంటాయి. వీటిని మనకు అవసరమైన విధంగా ఉపయోగించుకోవచ్చు. పిల్లలు వాడే టూత్‌బ్రష్‌కి ఈ సెన్సార్‌ని క్లిప్ చేస్తే చాలు. అది వారు దంతాలు శుభ్రం చేసుకునే తీరును చాలా సూక్ష్మ దృష్టితో గమనిస్తుంది. పళ్లు సరిగ్గా తోముకోడానికి మంచి సలహాలూ సూచనలు కూడా ఇస్తుంది. అలాగే పాలు తాగే గ్లాసుకు అమర్చారనుకోండి ఎన్ని పాలు తాగితే ఎన్ని కేలరీల శక్తి వస్తుందో లెక్కకడుతుంది. కాఫీ అయితే అందులో ఎంత కెఫిన్ ఉంటుందో చెబుతుంది. ఇలాంటి ఎన్నో విషయాల్లో సలహాలు, సూచనలు ఇస్తుంది ఈ బేబీ సిట్టర్.

ఫోన్ లాంటి గ్లౌజ్

ఎంత స్మార్ట్ ఫోనైనా ఎప్పుడూ చేతిలో పట్టుకు తిరుగుతూ మాట్లాడటం కష్టమే. పొరపాటున అది ఎక్కడైనా పెట్టి మర్చిపోగలం కూడా. పైగా వేలాది రూపాయలు పోసి కొన్న ఫోన్ పోతే ఎంత బాధ. దాని కోసమే కొత్తగా వచ్చిందే ఈ ఊలెన్ గ్లౌజ్. ఇది చేతికి మామూలు గ్లౌజ్‌లాగానే తొడుక్కొని హాయిగా మాట్లాడుకోవచ్చు. దానికి ఉండే వైర్ లెస్ కనెక్షన్ సహాయంతో చేతి వేళ్లనే ఫోన్‌గా మార్చుకోవచ్చు. అదెలా అంటారా...బొటనవేలుని స్పీకర్‌లా చెవి దగ్గర పెట్టుకొని, చిటికెన వేలుని మైక్‌లా నోటి దగ్గర పెట్టుకొని మాట్లాడుకోవచ్చు. దాని కంట్రోల్ మొత్తం చేతి మణికట్టుకు అమర్చబడి ఉంటుంది.

ఎక్కడ వున్నా...పక్కన వున్నట్టే

ఎప్పుడూ ఏదో ఒక పని మీద బయటకు వెళ్తుంటాం. అప్పుడు పెంపుడు జంతువులు ఉన్న వారికి వాటిని ఇంట్లో ఒంటరిగా వదిలేయాల్సిన పరిస్థితి. పాపం అది ఏం చేస్తుంటుందో. ఎలా ఉంటుందో అని బెంగ. మరేం ఫర్వాలేదు! ఇంట్లో 'స్పై ఆన్ ఫిడో' అనే చిన్న కెమెరా వదిలి వెళ్లితే చాలు. మనం ఎక్కడ ఉన్నా మన ఫోన్ నుండో కంప్యూటర్ నుండో వాటిని చూడవచ్చు. ఎలాగంటారా ఈ స్పై కుండే సెన్సార్లు ఫోన్ లేదా కంప్యూటర్‌కు కనెక్షన్ ఇస్తే సరి. ఇంట్లో అది ఎం చేస్తుందో ఎలా ఉందో జూమ్ చేసి మరీ చూడవచ్చు. ఇంకా అవసరమైతే దానితో మాట్లాడటానికి, కమాండ్స్ ఇవ్వడానికి ఆడియో కూడా ఉంటుంది. ఫోటోలు కూడా క్లిక్ చేయవచ్చు. అంతే కాదు రాత్రి పూట కూడా దానిని గమనించవచ్చు కెమెరాకు ఉన్న "ఇన్‌ఫ్రా రెడ్ నైట్ మోడ్" సహాయంతో.

నిద్ర లేపే సువాసనలు

చాలా మందికి బెడ్ కాఫీ తాగందే పడక మంచం దిగబుద్ధి కాదు. అలాంటి వారి బద్ధకం

ప్రయాణాల్లోనూ వేడి వేడిగా...

'గో ఎనీవేర్ హెచ్‌ఒబి' అనేది చూడటానికి ఒక పెద్ద ఐప్యాడ్ లాగా ఉంటుంది. డిజిటల్ స్క్రీన్, టచ్ స్క్రీన్ అన్ని ఉంటాయి. కాకపోతే ఇది ఐప్యాడ్ మాత్రం కాదు. జర్నీలో ఉన్నప్పుడు చల్లబడి పోయిన పదార్థాలను వేడి చేసుకొని తినడానికి ఉపయోగించే 'హాట్ పాట్'. దీనిలో ఆరు రకాల ఉష్ణోగ్రతలుంటాయి. అవి కీప్ వార్మ్, సిమ్మర్, హాట్ పాట్, బాయిల్, కీప్, పాన్‌ఫ్రై. వీటిల్లో 70- 240 సెంటీగ్రేడ్‌ల ఉష్ణోగ్రత వరకు వేడి చేయవచ్చు. అయితే దీనికి మనం చేయవల్సిందల్లా టైమర్ సెట్ చేసుకోవడమే.

వదిలించడానికే 'ఐ పొంగ్' ని రూపొందించారు. ఇది ఒక తెల్లటి గుడ్డు ఆకారంలో చాలా చిన్న పరిమాణంలో మన ఐఫోన్‌కి ప్లగ్స్ చేసుకునే విధంగా ఉంటుంది. నిద్ర పోయేటప్పుడు చెంత పెట్టుకుంటే చాలు. ఇక అదే మిమ్మల్ని పొద్దునే చక్కటి కాఫీ సువాసనలతో మేల్కొలుపుతుంది. దీనిలో ఐదు రకాలైన సువాసనలు ఉంటాయి. లావెండర్, స్ట్రాబెర్రీ, రోజ్మేరీ, గులాబీ, కాఫీ ఇంకా ఇది రూమ్ స్ప్రేగా కూడా ఉపయోగించుకోవచ్చు.

సంగీతం వినిపించే దిండు

కొంత మందికి రాత్రి పడుకునేప్పుడు చక్కని మ్యూజిక్‌ని ఆస్వాదించే అలవాటు ఉంటుంది. కానీ చుట్టు పక్కల వారికి అది ఇబ్బందికరంగా ఉంటుందని అభిరుచినే త్యాగం చేయాల్సిన పరిస్థితి. అలాంటి వారికి ఈ మ్యూజికల్ పిల్లో ఒక వరమనుకోవాలి. ఇది చుట్టు పక్కల వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఒక్కరికి మాత్రమే వినబడే వీలు ఉంటుంది. మీ స్మార్ట్‌ఫోన్‌ని కానీ, ఎమ్‌పిత్రీ ప్లేయర్‌ని కానీ ఆ దిండుకు అమర్చబడి ఉన్న ఒక చిన్న జేబులో ఉంచితే సరిపోతుంది. ఇక మీకు ఇష్టమైన సంగీతాన్ని మీరు మాత్రమే వింటూ హాయిగా నిద్రలోకి జారుకోవచ్చు.

బ్యాగ్‌లోనే వైన్

మన దేశంలో అంటే అలవాటు లేదు కానీ విదేశాల్లో మహిళలు కూడా వైన్ తాగుతారు. అక్కడ వాతావరణానికి అవసరం కూడా. అలాంటి వారు ఈ బ్యాగ్‌ను భుజానికి తగిలించుకొని వెళితే సరిపోతుంది. నిజానికి అది హ్యాండ్ బ్యాగ్ కాదు. వుడ్‌తో చేసిన బ్యాగ్. దానిలో వైన్ ఉంటుంది. దానికి ఒక చిన్న ట్యాప్ కూడా ఉంటుంది. కావాల్సినప్పుడు దాన్ని తిప్పుకొని గ్లాసులోకి వైన్ పోసుకోవచ్చు. ఇలాంటి ఏర్పాట్లు ఉన్న హ్యాండ్ బ్యాగులు మంచు ప్రదేశాల్లో నివశించే వారికి బానే ఉపయోగపడతాయి

- అనంతోజు మోహన్‌కృష్ణ

కరిని పోలిన సూకరం

నంది కడుపున పంది పుడుతుందని బ్రహ్మం గారు చెప్పారంటారు. చైనాలో మరో వింత జరిగిందండోయ్! పంది కడుపున ఏనుగును పోలిన పందిపిల్ల పుట్టింది. దాని శరీరంమీద ఒక్క వెంట్రుక కూడా లేకుండా నున్నగా అచ్చం ఏనుగులాగా ఉంది. తొండం కూడా ఉంది. చెవులు, ముక్కు ఏనుగుకు ఉన్నట్లే ఉన్నాయి. ఇది ఒక కేజీ బరువుంది. దీనిని చూడటానికి చుట్టు పక్కల జనాలు తండోప తండాలుగా వచ్చారు. కాని పుట్టిన దగ్గరి నుంచీ దానికి వరుసగా తుమ్ములు వచ్చాయి. దాంతో అది పాలు సరిగా తాగలేకపోవడంతో 9 గంటలు మాత్రమే బతికింది.

అగ్గిపుల్లలతో ఆయిల్ ప్లాట్‌ఫామ్

ఇప్పటి వరకూ అగ్గిపుల్లలతో చిన్న చిన్న కళాఖండాలను తయారుచేయడం చూశాం. కానీ బ్రిటీష్ ఆయిల్ రిగ్ వర్కర్ ఒకాయన అగ్గిపుల్లలతో ప్రపంచంలోనే అతి పెద్ద నమూనాను తయారుచేశాడు. అది దక్షిణ సముద్రంలోని ఆయిల్ ప్లాట్‌ఫామ్. దీనికి ప్రపంచ గిన్నిస్ రికార్డులో చోటు దక్కింది. అది 12 అడుగుల ఎత్తు, 21 అడుగుల పొడవు ఉంది. దీని కోసం ఆయన 40,75,000 అగ్గిపుల్లలను వాడాడు. దాని మొత్తం బరువు ఒక టన్ను ఉంటుంది. ఆయన పేరు డేవిడ్ రేనాల్డ్స్. ఆయనకు 50 సంవత్సరాలు. 'చాలా మంది ఐదారు గంటలు టీవీ ముందు కూర్చుంటారు. నాకది బోరు. అందుకే నేను కాసేపు పడుకుంటాను. కాసేపు దీనికోసం సమయం కేటాయిస్తాను' అని ఆయన అంటున్నారు. దీన్ని తయారు చేయడానికి 15 సంవత్సరాలలో 32,000 గంటలు వెచ్చించాడట. రోజుకు రెండు నుండి పది గంటలవరకూ దీనికోసం పని చేసేవారు. ఈ నమూనాలో రిగ్ వర్కర్స్‌కు వసతి గదులు, ఓడలు పెట్టడానికి స్థలం, ప్లాట్‌ఫామ్‌లు, టవర్లు ఉన్నాయి. దీనిని కొంత మంది మ్యూజియం వాళ్లు కొనడానికి ముందుకు వచ్చారు. హాలీవుడ్ నుంచి కూడా ఒక ఆఫరు వచ్చిందట.

బీరు బాత్

ఈ మాట వింటే మందు బాబులు బాధపడ తారు పాపం! 'తాగడానికే బీరు దొరకడం లేదు, దాంతో స్నానం ఏంట్రా బాబూ?!' అని. బీరుతో స్నానం చేస్తే కొన్ని ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందట. చర్మం చాలా మృదువుగా తయారవుతుంది. దీనివల్ల గాయాలు తొందరగా నయం అవుతాయి. ఇది రక్త ప్రసరణను పెంచుతుంది. అందుకే ఆస్ట్రియాలో ఏకంగా స్విమ్మింగ్ పూల్స్‌ని బీరుతో నింపారు. జర్మనీ ప్రజలు ఇళ్లలోనూ టబ్బుల్లో బీరు స్నానం చేస్తున్నారు. బీరుతో స్నానం చేసిన 15 నిమిషాల తరువాత శరీరమంతా ఎక్కడ ముట్టుకున్నా మృదువుగా ఉంటుందట! అంతా బానే వున్నట్టున్నా... బీర్ బాత్‌కి పైసలు కూడా బానే వసూలు చేస్తున్నారట.

బాల చందర్, క్రాంతి కుమార్ ఇద్దరూ ఇద్దరే అని అందరికీ తెలుసు. వీరి చిత్రాలు మిగిలిన వారికి భిన్నంగా వుంటాయి. ఇక కోడి రామకృష్ణ ప్రతిభావంతుడైన యువ దర్శకుడుగా మొదలై జన రంజన ప్రధానంగా విజయాలు సాధించేవైపు మళ్లాడు. ఇలాంటి విభిన్న నేపథ్యాలు గల ముగ్గురు దర్శకులూ ఒక రచయితోనే ఆఖరి వరకూ తమ చిత్రాల రచన చేయించుకున్నారంటే ఆయనెంత ప్రతిభావంతుడై వుండాలి? సోమవారం కన్ను మూసిన గణేష్ పాత్రో స్థానమేమిటో చెప్పడానికి ఇదొక్క ఉదాహరణ చాలు.



మనసును కదిలించే మాటకారి

సినీ రంగంలో పాత్రో గురించి చెప్పుకునే ముందు నాటక రంగంతో మొదలు పెట్టాల్సిందే. ఆయనకు నివాళులర్పించిన వారెందరో ఆ సంగతులు చెప్పారు గాని అంతగా ప్రస్తావనకు రాని విషయాలున్నాయి. పాత్రో మేనమామ కె.వెంకటే శ్వరరావు రంగస్థలాన్ని విశేషంగా ప్రభావితం చేసిన మహామహుల్లో ఒకరు కావడం అందుకు దోహదం చేసి వుండొచ్చు. ప్రధానమైంది పాత్రో ప్రతిభ, కృషి వుండబట్టే దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకో గలిగారు. ఆ రోజుల్లో తామంతా మామ వేయడం వల్లే ఆయన నాటికలకు అంత పేరు వచ్చిందనుకునే వాళ్లం గాని అది నిజం కాదని యండమూరి వీరేంద్రనాథ్ స్పష్టంగా చెప్పేశారు. గణేష్ పాత్రో రాసిన 'ఆగండి.. కొంచెం ఆలోచించండి..' నాటిక అత్యవసర పరిస్థితి చీకటి రోజుల్లో ప్రజా నాట్యమండలికి గొప్ప ఆధారమైంది. రాజకీయాల కోసం అన్నదమ్ముల మధ్య తగాదా పెట్టి మాయమాటలతో పబ్బం గడుపుకునే పాలకవర్గ నేతలను ఎండగట్టడానికి ప్రజా కళాకారులు దాన్ని ఉపయోగించుకున్నారు. మూడు పాత్రల చిన్న నాటిక గనక వేయడం కూడా సులభంగా వుండేది. అంతా అయిపోయి ఫ్రీజ్ షాట్‌లో ప్రేక్షకులు లేచి వెళ్లిపోయేటప్పుడు ఆగండి కొంచెం ఆలోచించండి అన్న మాటలు వినిపించేవి. ఆయన రాసిన 'కొడుకు పుట్టాల' నాటకంలో డబ్బు కోసం పెళ్లి కాకుండానే ఆపరేషన్ చేయించుకోవడం ఇతివృత్తం. సంజయ్ గాంధీ బలవంతపు ఆపరేషన్ల నేపథ్యాన్ని గుర్తు చేసుకుంటే ఇందులో సందేశం తెలుస్తుంది. ఇక 'పావలా' నాటికలో ముసలి మామ జిహ్వా చాపల్యం, పసి కందు పాలు, సవతికి పూలు అన్ని ఆ పావలాలోనే కొనాలి అంతా అయిపోయిన తర్వాత ఆ పావలా చెల్లదని తేలుతుంది. 'అసుర సంధ్య' నాటకం కూడా ఇలాగే సంచలనం కలిగించి తన 'కళ్లు' నాటికతో సమానంగా నిలిచిందని పాత్రోకు సన్నిహితుడైన గొల్లపూడి మారుతీరావు రాశారు. ఆయన నాటకానికి పోటీగానే తాను కుక్క రాసినట్టు వీరేంద్రనాథ్ వెల్లడించారు. ఇవన్నీ ఆయన ప్రభావాన్ని చెప్పేవే.

గాంధీ పుట్టిన దేశంతో సంచలనం కలిగించిన నటుడు ప్రభాకరరెడ్డి రెండవ చిత్రంగా నాకూ స్వతంత్రం వచ్చింది తీశారు. 'పావలా, కొడుకు పుట్టాల' నాటికలు కలిపిన ఆ కథతోనే గణేష్ పాత్రో చిత్రరంగంలోకి ప్రవేశించారు. ఎమర్జన్సీలో ఆ చిత్రం ఒక సాహసమైనా విజయం సాధించలేదు. అందులో ప్రజాశక్తి పత్రికను చూపించడమే గాక ఉగ్రవాద రాజకీయాల నిరర్థకతను కూడా చెబుతారు. చిత్రం పెద్దగా ఆడకపోయినా పాత్రో శక్తి సామర్థ్యాలు అందరికీ తెలియడానికి అది ఉపయోగపడింది. అదే సమయంలో ఆ చిత్రంలో నాయికగా వున్న జయప్రదతోనే అంతులేని కథ తీసి బాలచందర్ రంగ ప్రవేశం చేశారు. ఆ చిత్రంలో సంభాషణలకు జనం కేరింతలు కొట్టారు. సరిత అంటే నది.. ఆమె అన్ని బాధలు భరించినది.. అంటూ వేసిన ట్యాగ్ లైన్‌తో మొదలు పెట్టి ఆచిత్రంలో ప్రతి సన్నివేశాన్ని సంభాషణను ఆస్వాదించారు. 'ఇది కథ కాదు'లో వెంట్రిలోక్విజం ద్వారా కమల్ హాసన్ తన భావాలు చెబుతుంటాడు. చివరలో నాయిక జయసుధ 'బొమ్మ ద్వారా మాట్లాడేది నీవేనని తెలుసు గాని బొమ్మ మనసే నీ మనసని తెలియదు' అంటుంది! 'సంసారం ఒక చదరంగం'లో గొల్లపూడి, జానకి సుహాసిని సంభాషణలు చురుక్కున తగులుతాయి. క్రాంతి కుమార్ చిత్రాల్లో నాయికల మాటలు పురుషాధిక్యతపై ఈటెల్లా తాకుతుంటాయి. 'స్వాతి'లో తల్లిపై నిందలు వేసిన వారికి సుహాసిని ఇచ్చే సమాధానాలు గొప్పగా పేలుతాయి. చివరలో తల్లికి రెండో పెళ్లి చేయాలని నిర్ణయం తీసుకున్నాక ఎదుర్కొనే సంఘర్షణనూ అంత శక్తివంతంగా పలికిస్తాడు ఆయన.

గోదావరి వాతావరణంలో తీసిన 'సీతా రామయ్య గారి మనవరాలు' దానికదే ఒక విలక్షణ చిత్రం. ఇది సీతారామయ్య గారింట్లో పెళ్లి అనడంతో మొదలై ఆఖరి వరకూ ఆయన పెద్దరికం చుట్టూ తిరుగుతుంటే తండ్రి చనిపోయినట్టు చెప్పలేని మనవరాలి మనోవేదనను ఆవిష్కరించాలి. వాస్తవానికి క్రాంతికుమార్ చాలా చిత్రాల్లో ఇలా చావును దాచిపెట్టే ట్విస్టు వుంటుంది (శారద, స్రవంతి, స్వాతి). అయినా దాన్ని కప్పి పుచ్చి రక్తి కట్టించడంలో గణేష్ పాత్రో మాటలదే పెద్ద పాత్ర. కోడి రామకృష్ణ చిత్రాల్లో ద్వంద్వార్థ సంభాషణలకు పేరు వచ్చినా దానివల్ల గణేష్ పాత్రో స్థానం చెక్కు చెదరలేదు. 'ఆకలి రాజ్యం'లో శ్రీదేవి- కమల్ హాసన్- ప్రతాప్ పోతన్ పాత్రల మధ్య జరిగే సంభాషణలు, శ్రీశ్రీ కవితల ఉటంకింపులూ గణేష్ పాత్రో శక్తికి మచ్చు తునకలు. బాలచందర్ శిష్యుడైన ఈరంకి శర్మ తీసిన 'చిలకమ్మ చెప్పింది'లో సంగీత, రజనీకాంత్, మన్మథరావు పాత్రలో పరిచయమైన పి.ఎల్.నారాయణ మాటలు ఒక ఎత్తయితే చెవిటి హీరోగా నారాయణరావు మాట్లాడే ఒకటి రెండు మాటలు హృదయాలను కదిలిస్తాయి. చివరి గొప్ప విజయమైన సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు చూసినా అన్నదమ్ములుగా వేసిన వెంకటేష్ మహేష్‌ల మధ్య గాని 'ఏమిటో నాకన్నీ తెలిసిపోతుంటాయి' అనే అంజలి పాత్రలోగాని, అకారణంగా విషం గక్కే రావు రమేష్ పాత్ర మాటలు గాని సహజంగా ధ్వనిస్తాయి. ఇలా ఆయన మొత్తం 120 చిత్రాలకు మాటలందించి తనకంటూ ఒక ముద్ర వేసుకుని సెలవు తీసుకున్నాడు. కాకుంటే బాలచందర్ మరణం తర్వాత పదిహేను రోజుల్లోనే గణేష్ పాత్రో నిష్క్రమించడం వారిద్దరూ కలసి రక్తికట్టించిన నాటకీయతను ప్రతిబింబిస్తుంది.

- తె.ర

నవ్వుల్ – పువ్వుల్

పర్స్

వెంకీ: రాత్రి నీవు పార్టీలో పర్స్ మర్చిపోయావ్..!

రాంకీ: నేను మర్చిపోయానా... నీవు గానీ కొట్టేసావేమోననుకున్నా..!

సరిపోద్ది

యజమాని: ఏయ్ మిస్టర్.. టిఫిన్ తిన్నావుగా బిల్లు కట్టు..!

వ్యక్తి: నాకూ ఓ హోటల్ వుంది. మీరు వచ్చి నా హోటల్‌లో టిఫిన్ తినండి బిల్లు సరిపోద్ది..!

ఉద్యోగం

అనంత్: ఎంతటి కష్టమయిన ఉద్యోగమయినా చేస్తావా..?

ఆకాష్: ఆ చేస్తా.. చెప్పు..!

అనంత్: పాముకి పాలు పట్టించే ఉద్యోముంది, రెడీనా..!

పేరేంటి?

అధికారి: మీ ఫాదర్ పేరేమిటి....

ఉద్యోగార్థి: ఏం.. కొంపదీసి ఆయన కూడా ఇంటర్వ్యూకి వచ్చారా.. అయితే ఈ ఉద్యోగం కూడా నాకు రానట్టే..!

గొప్పలు



చీమ: నేను నీకన్నా చాలా గొప్పదాన్ని తెలుసా..!

ఏనుగు: ఎలా..?

చీమ: నేను చిన్న కన్నంలో కూడా దూరగలను, కానీ నీవు దూరలేవుగా.. అలా..!

ఏం ఫ్యామిలీ?

భార్య: మీది గాడిద ఫ్యామిలీనా..!

భర్త: అదేంటీ.. అలా విచిత్రంగా అడుగుతున్నారు..?

భార్య: మీరంతా గురక బదులు ఓండ్ర పెడుతుంటేనూ..!

పెళ్లి

రంగ: ఎప్పుడూ ఎవరితోనూ మాట్లాడకుండా, మూగవాడిలా వుండేవాడివి, ఆఖరకు ఎవరిని పెళ్లి చేసుకున్నావురా..?

లింగ: లైబ్రేరియన్ గారి అమ్మాయిని..!

కసి

సతీష్: ఆ కుక్క వెనకాల నీవు పరిగెడుతున్నావేం..?

నితీష్: అది నన్ను కరిచింది మరి.. దాన్ని నేను కరిచి కసి తీర్చుకుందామని..!

బి.పి

రోగి: నాకు బి.పి అంతకంతకూ పెరిగిపోతుంది డాక్టర్..!

డాక్టర్: ఏం దేనికి...?

రోగి: మీరు ఫీజుగాని ఎక్కువ అడుగుతారేమోనని..!

దావా

భిక్షగాడు: బాబూ ధర్మం చేయండి..!

దానయ్య: ఇదిగో రూపాయి..!

భిక్షగాడు: నాకు వేస్తే వేశారు గానీ, నా పక్కవాడికి మాత్రం వేయకండి..

దానయ్య: పరువు నష్టం దావా కింద మీ మీద కేసు పెడతాడు..!

తెలివి

మాస్టారు: ఏరా పులి తెలివైనదా, మేక తెలివైనదా.. చెప్పగలవా..?

రాము: ఓ..... మేకే తెలివైనది..!

మాస్టారు: ఎలా..?

రాము: మేక 'మే' అని ఇంగ్లీష్ నెల పేరు చెప్పగలదు.. కాని పులి చెప్పలేదుగా.. అలా..!

టీ, కాఫీ

కస్టమర్: ఏవయ్యా, ఓ టీ చెప్పు..!

సర్వర్: అలాగే చెబుతా గానీ, నాకో కాఫీ చెప్పండి..!

- ముత్యాల శ్రీశరత్‌బాబు, ఫోన్ నెం : 9963298921

అతి ప్రాచీన ఆలయం

ఆంకోర్ వాట్

ప్రాచీన కట్టడాలను చూస్తుంటే మనకు ఏదో తెలియని అనుభూతి కలుగుతుంది! 'ఆంకోర్ వాట్' ఆలయం కూడా అలాంటి ఎన్నో అనుభూతులను కలిగించే కట్టడమే. ఇది దక్షిణాసియాలోనే అతి ప్రాచీనమైనది. ఆలయం మొత్తం రాతితో కట్టినదే. ఆలయ గోడలపై, స్థంభాలపై రకరకాల చిత్రాలను చెక్కారు. పాలసముద్రాన్ని చిలుకుతున్న దేవతలు, రాక్షసులు, నాట్యం చేస్తున్న సుందరాంగులు, రణరంగంలో కృష్ణుడు, కౌరవులు, పాండవులు, ఆ ఆలయ ప్రాంగణంలో అక్కడక్కడ కొలనులు, మార్గ మధ్యలో పలకరించే సింహాలు... అక్కడ ఉన్నంత సేపూ కథల్లో విన్న, సినిమాల్లో చూసిన పౌరాణిక గాథలు మన ముందు ప్రత్యక్షమైనట్టుంటుంది.

కంబోడియా ప్రాచీన కట్టడాలకు నిలయం. ఆంకోర్ వాట్ అనేది ఒక ప్రాచీన ఆలయం. ఇది కంబోడియాలోని ఆంకోర్‌లో ఉంది. ఆలయం మధ్యలో ఉన్న ఐదు శిఖరాలు పర్వత శిఖరాలను తలపిస్తాయి. ఆలయం చుట్టూ గోడలు, వాటి చుట్టూ ఆలయాన్ని రక్షించేందుకు ఎత్తైన కోటగోడ ఉంటాయి. ఆలయం బయటి గోడలు, కొన్ని రహస్య నిర్మాణ భాగాలు తప్ప మిగతా అన్నిటినీ ఇసుకరాతితోనే నిర్మించారు. తామర మొగ్గల ఆకారంలో ఆలయ గోపురాలు, సందర్శకులు వెళ్లే మార్గాలను కలుపుతూ ప్రదర్శనశాలలు, ఎత్తైన ఆలయ శిఖరాలు ఎంతో ఆకర్షిస్తాయి. ఆలయ ప్రహరీ గోడ 1024 మీటర్ల పొడవు, 4.5 మీటర్ల ఎత్తుతో ఉంటుంది. దాని చుట్టూ 190 మీటర్ల వెడల్పుతో ఒక పెద్ద అగడ్త ఉంటుంది. ముఖ్యమైన ద్వారం చెక్క వంతెనతో ఉంటుంది. అతి ముఖ్యమైన ప్రదేశాలలో గోపురాలు ఉంటాయి. ఆలయానికి పశ్చిమాన చాలా విశాలంగా ఉంటుంది. అక్కడ మూడు శిథిలమైన స్తంభాలు ఉంటాయి. దక్షిణాన గల శిఖరం కింద విష్ణువు విగ్రహం ఉంటుంది. దీనిని ఆలయం మధ్యలోనున్న మందిరంలో ఉంచారు. దీనిని 'తారీచ్' అంటారు. ఆలయానికి రెండు ద్వారాలు ఉంటాయి. వీటి గుండా పెద్ద పెద్ద జంతువులు సైతం వెళ్లగలవు. అందుకే వీటిని ఏనుగు ద్వారాలు అంటారు. వీటి మధ్య చాలా దూరం ఉంటుంది. ఈ మధ్యలో శిఖరాలు, ప్రదర్శనశాలలు ఉంటాయి. శిఖర గోడలపై నాట్యం చేస్తున్న ఆకారాలు, జంతువులపై నాట్యం చేస్తున్న దేవుళ్లు, దేవతల రూపాలు చూపరులను ఇట్టే ఆకర్షిస్తాయి.

ఎంత ఎత్తో...

ఆలయ ద్వారాల వద్ద వున్న గ్రంథాలయాలు దీనికి సంబంధించిన చరిత్ర తెలుసుకునేందుకు వీలుగా ఉంటాయి. ఈ గ్రంథాలయాలకు ఆలయానికి మధ్య కొలనులు ఉంటాయి. ఈ కొలనులు ఈ మధ్య కాలంలో ఏర్పాటు చేసినవి. టెర్రస్ మీదనున్న ఆలయం నగరం కంటే ఎత్తులో ఉంటుంది. ఇది మూడు దీర్ఘ చతురస్రాకార ప్రాకారాలతో ఉంటుంది. ఇవి ఒకదానిని మించి మరొకటి ఎత్తులో ఉంటాయి. ఈ మూడింటిని బ్రహ్మ, చంద్రుడు, విష్ణులతో పోలుస్తారు. ఇక్కడ నాలుగు భవన ప్రాకారాలు ఉంటాయి. వీటి గోడలపై దేవతల రూపాలు విడివిడిగా, గుంపులు గుంపులుగా ఉంటాయి. లోపలి ప్రదర్శనశాలను బాకన్ అంటారు. ఇది 60 మీటర్ల చతురస్రాకారంలో ఉంటుంది. దీని పైకప్పు అడుగుభాగాన పాము శరీరంతో, సింహం లేదా గద్ద తల ఉన్న ఆకారంతో వింత రూపాన్ని చెక్కారు. ఈ ప్రాకారాల గోడలపై హిందువుల మహాకావ్యాలైన రామాయణం, మహాభారత చిత్రాలను చెక్కారు. వాయవ్య దిశలో పశ్చిమ

మూలన ఉన్న ప్రదర్శనశాలలో శ్రీలంక యుద్ధభూమి, కురుక్షేత్ర యుద్ధభూమి చూడొచ్చు. దక్షిణ ప్రదర్శనశాలలో చారిత్రాత్మక దృశ్యమైన సూర్యవర్మ-2 రాజు ఊరేగింపు కళ్లకు కట్టినట్టుగా ఉంటుంది. తూర్పు ప్రదర్శనశాలలో దేవతలకు, రాక్షసులకు పాలసముద్రాన్ని వాసుకి సర్పంతో చిలకడాన్ని చూపిస్తున్న విష్ణువు... నిజంగా మనమా దృశ్యాన్ని చూస్తున్న భావన కలుగుతుంది. ఉత్తర ప్రదర్శనశాలలో బాన మీద కృష్ణుని విజయం, హిందూ దేవతలకు రాక్షసులకు మధ్య యుద్ధం వంటివి చూడొచ్చు.

ఎంత పనితనం!

ప్రస్తుతం ఈ కట్టడాన్ని నిర్మించాలంటే 300 సంవత్సరాలు పడుతుందని ఇంజనీర్ల అభిప్రాయం. కాని అప్పుడు మాత్రం దీన్ని 40 సంవత్సరాలలోనే నిర్మించారట. ఎప్పుడనుకున్నారు? 12వ శతాబ్దంలోని మొదటి అర్ధశతాబ్దంలో సూర్యవర్మ-2 రాజు కోసం నిర్మించారు. ఈ ఆలయ చిహ్నాన్ని 1863లో ఆ దేశ జాతీయ జెండాలో చేర్చారు. హిందువులకు, బౌద్ధులకు అతి ప్రాచీనమైన ఆధ్యాత్మిక ఆలయాలలో ఇది ముఖ్యమైంది. ఇది పర్యాటకులకు దేశంలో ప్రత్యేక ఆకర్షణగా ఉంది. ఇది కిమర్ కట్టడాలకు సాంప్రదాయక చిహ్నం. దక్షిణ భారత హిందువుల కట్టడాలకు అనుగుణంగా ఈ ఆలయాన్ని రెండు భాగాలుగా నిర్మించారు. ఒకటి ఆలయ పర్వతం. రెండో భాగానికి ఓ ప్రత్యేకత ఉంది. దీనిని పడమర దిక్కున నిర్మించారు. కంటికి ఇంపుగా, ఎంతో వైభవంగా ఉంటుందీ ఈ ఆలయ కట్టడం. ఆలయం గోడలపై రకరకాల దేవతలను అలంకరించినట్టుగా ఉంటుంది. ఆంకోర్‌కు నగరదేవాలయం అని పేరు పెట్టారు. సీమ్‌రీప్ నగరానికి 5.5 కిలోమీటర్ల దూరంలో బాఫౌన్ నగరం మధ్యలో ఉంది. అయితే ఇది ప్రపంచంలో కెల్లా అసాధరణమైన కట్టడం. ఇలాంటి భవనం మరెక్కడా కనపడదేమో. భారత్‌లోని తమిళనాడు, ఒరిస్సాలలోని కట్టడాల ప్రభావం ఈ ఆలయ నిర్మాణంపైనా ఉంది. ■

◆ సినిమా కబుర్లు

సిన్మా కోసం బరువు పెంచేశారు!

- చూటీ

చియాన్‌కే చెల్లు



హీరో విక్రమ్‌కు చిన్నతనంలోనే నాటకాల పట్ల ఆసక్తి వుండేది. స్టేజి షోలు సైతం చేసేవాడు. నటన పట్ల వున్న ఆ ఆపేక్షతోనే క్యారెక్టర్ కోసం ఎంత కష్టపడడానికైనా వెనుకాడడు. 'అపరిచితుడు, శివపుత్రుడు...' చూశాం కదా. అలా ప్రతి చిత్రంలోనూ తనదైన నటనను, ప్రత్యేకతను కనబరిచే చియాన్ తాజాగా 'ఐ' సినిమా ద్వారా తనలోని మరో కోణాన్ని ప్రేక్షకుల ముందుంచనున్నాడు. శంకర్ దర్శకత్వంలో సంక్రాంతికి రానున్న ఈ చిత్రంలో విక్రమ్ నాలుగు పాత్రలు పోషించాడు. పాత్ర డిమాండ్ మేరకు ... సినిమా మొదటి సగం వరకు 45 కేజీల బరువు... రెండవ సగంలో 110 కేజీలు వుండాలి. ఒక్క సినిమా కోసం రెండు రకాలుగా శరీరాన్ని మలచుకోవడమంటే చిన్న విషయం కాదు. మూడేళ్లపాటు శ్రమించి... విజయం సాధించాడు. అతను ఏం తినాలో, ఎంతసేపు వ్యాయామం చేయాలో అంతా బాడీ ట్రయినర్ నిర్ణయించేవాడు. దాన్ని చియాన్ బుద్ధిగా అనుసరించేవాడు. 'శరీరాన్ని మరీ అంతగా కష్టపెట్టడం అవసరమా?!' అని మీడియా మిత్రులు అడిగిన ప్రశ్నకు విక్రమ్ ఏమని సమాధానమిచ్చాడో తెల్సా! 'అప్పుడే కదా ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేయగలిగేది? లేకపోతే పాత్రకు బదులుగా నేనే కనిపిస్తాను' అని.

కండల వీరుడు ప్రభాస్

రాజమౌళి ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'బాహుబలి'. ఇందులో హీరో ప్రభాస్‌ను మాంచి దృఢకాయుడిగా చూపించబోతున్నాడు. అందుకోసం ప్రభాస్ కనీసం 150 కేజీల బరువు వుండాలని సూచించినట్టు సమాచారం. ఫిట్‌నెస్ శిక్షకులు లక్ష్మణ్ రెడ్డి మార్గదర్శకత్వంలోనే అనుకోండి. విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన పరికరాలతో గంటల తరబడి వ్యాయామం చేస్తూ, నిపుణుల సూచన మేరకు శాకాహారం తీసుకుంటూ కండలు తిరిగిన వీరుడిలా తయారయ్యాడు. స్టెరాయిడ్లతోనూ కండలు పెంచేవారి గురించి వింటుంటాం. 'అది ఆరోగ్యానికి అంత మంచిది కాదు. సహజసిద్ధమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామానికి ప్రాధాన్యతనివ్వడమే సరైన పద్ధతి' అన్నది ట్రయినర్ లక్ష్మణ్ రెడ్డి మాట. అయితే ఇక్కడో ట్విస్టు వుంది. ఈ చిత్రంలో ప్రభాస్ రెండు రకాలుగా కన్పించాలి. ఒకదశలో సన్నగా, మరో దశలో దృఢకాయుడిగా. బరువు పెరగడం ఎంత కష్టమో! పెరిగాక తగ్గడం కూడా అంతకన్నా కష్టం! ఆ రెండిటినీ సుసాధ్యం చేసి చూపించాడీ యంగ్ హీరో.

రానా... రెండు పాత్రలు

ఒకేసారి రెండు చిత్రాలు చేయడం పెద్ద విశేషం కాదు. అయితే రెండిట్లో రెండు రకాలుగా కనిపించాల్సి వస్తేనే సమస్య! 'బాహుబలి'లో భల్లాలదేవగా దృఢకాయుడై వుండాలి. 'రుద్రమదేవి'లో చాళుక్య వీరభద్ర పాత్రలో కొద్దిగా సన్నగా వుండాలి. ఒక సినిమా కోసం బరువు పెరగాలి. మరో చిత్రం కోసం బరువు తగ్గాలి. అదీ ఒకే సమయంలో. రెండూ విజయవంతంగా చేసేశాడు రానా. భోజన ప్రియుడైన దగ్గుబాటి వారబ్బాయికి బరువు పెరగడం పెద్ద కష్టమేం కాలా! 'సాయంత్రం వరకు ప్రతి రెండు గంటలకోసారి... చికెన్, మటన్... వంటివి లాగించేవాణ్ణి. దాంతో అదనంగా వ్యాయామం చేయాల్సి వచ్చేది...” అని అసలు సీక్రెట్ చెప్పేశాడు కుర్ర కథానాయకుడు.

బొమ్మాళి 'బరువు' బాధ్యతలు

కథానాయికగా ఎక్కువ కాలం రాణించాలంటే ... అందాన్ని, అందమైన ఆకారాన్ని కాపాడుకుంటూ వుండాలి. అందుకోసం హీరోయిన్లు ఎంతో కష్టపడుతుంటారు. తమకిష్టమైన ఆహారానికి దూరంగా వుంటుంటారు. అయితే అనుష్క మాత్రం ఓ సినిమా కోసం బరువు పెరగనుందట. అదీ దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు కుమారుడు ప్రకాష్ చిత్రం కోసం. కెమెరా ట్రిక్‌తో బొద్దుగా వున్నట్టు చూయిస్తానని ప్రకాష్ అన్నప్పటికీ సహజసిద్ధంగానే సైజ్ పెంచడానికి సిద్ధపడింది బొమ్మాళి. అయితే ఆమె చేస్తున్న 'రుద్రమదేవి', 'బాహుబలి' చిత్రాలు పూర్తయ్యాకనే!

◆ అట్టమీది కథ

సంక్రాంతి సొంతూరు

**ఏడాదిలో తొలి పండుగ. ఏడాదికోసారొచ్చే పండుగ.
పెద్ద పండుగ....తెలుగు వారికే సొంతమైన పండుగ.
పల్లెటూరి పండుగ. కష్టజీవుల పండుగ.
జాన పదుల పండుగ.... సంక్రాంతి పండుగ.
చదువు కోసమో...బతుకుదెరువు కోసమో,
కారణమేదైనా కన్నతల్లికి, పుట్టినూరుకు దూరమయ్యాం.
సొంత ఇంటికే బంధువులమయ్యాం. ఫర్వాలేదు...
దేశం కాని దేశంలో ఉంటేనేం. పట్టణ వాసపు జీవనంలో
మగ్గితేనేం. సంక్రాంతికి మాత్రం సొంతూరుకు
పరుగెడతాం. ఆఫీసులో సెలవులేదు. అయినా సరే
ఈ పండక్కి మాత్రం ఊరెళ్లాల్సిందే. ఏందుకంటారు?
అమ్మ కోసమా, ఊరమ్మ కోసమా, మట్టివాసన కోసమా,
మధురస్మృతుల కోసమా...ఎందుకో!?**

- సాంత్వన్

ఉరుకుల పరుగుల జీవితం. ఊపిరి సలపని పని. ఆత్మీయతలు, అనుబంధాల ఊసే లేని క్షణాలు. ఆఫీసులో వర్క్ టార్గెట్లు. బాసుల చిర్రు బుర్రులు. సహోద్యోగుల కృత్రిమ పలకరింపులు. ఏదో తెలియని వెలితి. కాసేపు ప్రకృతిని ఆస్వాదించాలనుంటుంది. ప్రకృతి అంటే ...ఇరుకు ఇళ్లు, చిన్న చినుకులకే చీదరపుట్టించే రోడ్లు. ఎడతెరిపిలేని ట్రాఫిక్, చెవులు హోరెత్తేలా వాహనాల రొదలు. పచ్చదనమే తప్ప ప్రశాంతత దొరకని పార్కులు. వెరసి నగర జీవనం మొత్తంగా ఒక ప్లాస్టిక్ పువ్వు మాదిరి అనిపిస్తుంది. పుస్తకాల సంచి భుజానేసుకుని పరిగెత్తే పిల్లలకైనా, ఆదరా బాదరాగా లంచ్ బాక్సు లతో ఉరికే ఉద్యోగికైనా... విరామం, విశ్రాం తి కావాలి. అందుకు సంక్రాంతి పండక్కి తప్పకుండా ఊరెళ్లాల్సిందే అంటారు పల్లె విడిచి పట్నవాసానికొచ్చిన ప్రతి ఒక్కరూ. .

నెలనాళ్ల ముందుచూపు

మద్రాస్ ఐఐటిలో చదివే తెలుగు విద్యార్థి అయినా, బెంగుళూరులో ఆంధ్రా మెస్ యజమానైనా, హైదరాబాద్‌లో పని చేసే వలస భవన నిర్మాణ కార్మికుడైనా...సంక్రాంతికి ఊరెళ్లాలంటే నెలనాళ్ల ముందే టిక్కెట్టు రిజర్వేషన్ చేయించుకోవాల్సిందే. లేకుంటే మాత్రం ముప్పు తిప్పలు పడి మూడు చెరువుల నీళ్లు తాగినంత పనవుతుంది ప్రయాణం. ఆర్టీసీ వాళ్లు ఎన్ని స్పెషల్ బస్సులు పెట్టనివ్వండి, రైల్వేవాళ్లు ఎన్ని ప్రత్యేక రైళ్లు పెంచనివ్వండి...అబ్బే సరిపోవు. ఈ సంక్రాంతి సెలవు దినాల్లో నిండు చూలాల్లా కనిపిస్తుంటాయి బస్సులు, రైళ్లు. ఇక ట్రావెల్స్ యజమానులకైతే ఇదే అదును దోపిడీ ద్వారాలు తెరవడానికి. ఇక మన భాగ్యనగరంలోని మహాత్మాగాంధి బస్టాండ్‌కు ఒకసారి వెళ్లి చూడాలి తిరునాళ్లే. ఇసుక వేస్తే రాలనంత జనం. తల్లి చంకలో చంటి బిడ్డ, పక్కన లగేజీ సంచులు...బస్సులో సీటుకోసం పరితపిస్తూ కనిపించిన కండెక్టర్ సార్‌లను ఖాళీలున్నాయా అని అడగటం...నిరాశలు, పెదవి విరుపులు ఇలాంటి దృశ్యాలు కోకొల్లలుగా కంటపడతాయి. చివరికి నిలబడైనా వెళ్లాల్సిందే అనే నిశ్చయం. ఒక గంటా, రెండు గంటలా సర్దుకొని ప్రయాణించడానికి....ఫర్వాలేదు ఎలాగైనా ఊరెళ్లాలి. పిల్ల, పాప అందరూ కలిసి సకుటుంబ సపరివార సమేతంగా ఊరెళ్లాలి. మరో పక్క మనస్సులో మాత్రం ఛ...ఇక ఎప్పుడూ సంక్రాంతి సీజన్‌లో ఊరెళ్లకూడదు అనే భావన మెదలకమానదు. కాని ఇప్పుడు మాత్రం వెళ్లాల్సిందే. ఎందుకంటే మనస్సు అనే లగేజీ సంచుల్లో ఏడాదికి సరిపడా మధురానుభూతులను మూటకట్టుకొని తెచ్చుకోవాలిగా! మరి దేశం కాని దేశంలో ఉంటున్న వారికి మాత్రం సొంతూరుపై మమకారం ఉండదా. పండక్కి ఊర్లో ఉండాలి. అమ్మ, నాన్నతో గడపాలి. అయిన వారందరినీ కలవాలన్న ఆశలు వారికీ ఉంటాయి కదా. దుబాయ్, సింగపూర్, మలేషియా, అమెరికా వంటి వివిధ దేశాల్లో నివశించే తెలుగు వారు పండక్కి ఊరు రావాలంటే....ఏముంది డబ్బుంటే చాలు, కావాల్సినన్ని విమాన సౌకర్యాలు. ఆర్థిక సమస్య పెద్దగా లేకపోయినా...సెలవు సమస్య మాత్రం ఉంటుందట అక్కడ. ఎందుకంటే అక్కడి వారికి సంక్రాంతులు తెలియవు కదా! కానీ మన వారు తెలివైన వారు. సెలవు దినాల్లో పనిచేసి, అనుకున్న సమయానికన్నా ముందే వర్క్ టార్గెట్లను పూర్తిచేసి సంక్రాంతి నాటికి ఊరిలో ఉండటానికి ప్రణాళికలు రూపొందించుకుంటారట.

పిల్లల సంక్రాంతి

సంక్రాంతి అంటే... అందులో పిల్లల

ఆనందాలకు అవధులుండవు. పుస్తకాల మోత ఉండదు. హోంవర్క్‌లుండవు. బడి గంట అసలే వినపడదు. ఎంచక్కా సెలవుల్లో అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లచ్చు...నాన్నమ్మ చేత బోలెడన్ని కథలు చెప్పించుకోవచ్చు. ఇంట్లో ఎన్ని పిండి వంటలున్నా, అత్తయ్య, మామయ్య ఇచ్చే డబ్బులతో కురుకురేలు కొనుక్కోవచ్చు. ఊర్లో ఉండే పిల్లలందరినీ పోగు చేసి దాగుడు మూతలు, ముక్కు గిల్లుడు, దొంగ పోలీస్ ఆటలన్నీ ఆడుకోవచ్చు. కేరింతలు కొడుతూ గాలి పటాలు ఎగరేయవచ్చు. హరిదాసు ఎప్పుడొస్తాడా అని ఎదురుచూడటం. ఆయన కలశంలో బియ్యం పెట్టాలని తహతహలాడటం. పోటీకొచ్చిన అక్కతోనో తమ్ముడితోనో గిల్లిగజ్జాలకు దిగటం ఇలాంటివి బోలెడన్ని. ఇక భోగి రోజైతే...వీధిలో అందరికంటే పెద్ద భోగి మంట వేయాలి. పాత చెక్క ముక్కలు, బెల్లపు బుట్టలు, అట్ట పెట్టలు అన్నీ పోగుచేయాలి. ఆనాటి కోసమే తయారు చేసిన పిడకల దండను బయటకు తీయాలి. ఎవరి దండ పెద్దదో బేరీజు వేయాలి. అవన్నీ భోగి మంటలో వేసి నులి వెచ్చని ఆవిర్లను ఒంటికి రుచి చూపించాలి. కొత్త బట్టలు తొడుక్కోవాలి. కాస్త ఆర్థికంగా అంత అంత మాత్రంగా ఉన్న కుటుంబాల్లో పిల్లలైతే...ఏడ్చి..మారంచేసి అమ్మానాన్న చేత బట్టలు కొనిపించుకుంటారు. ఒకవేళ కుట్టమని దర్జీకిస్తే ...ఇక సంక్రాంతి పండుగ రోజుకూడా టైలర్ షాపు చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిందే. నా చొక్కా ఎప్పుడు కుడతాడు...నా ఫ్యాంటు ఎప్పుడు ఇస్తాడోనని ఆత్రంగా ఎదురు చూడాల్సిందే. తీరా కొత్త బట్టలు చేతికొచ్చాక ఉబలాటంతో వేసుకుందామని చూస్తే చొక్కాకు ఒక గుండీ లేదు...పట్లాంకు కాజా కుట్టడం మర్చిపోయాడు...ఏడుపు ముఖంతో మళ్లీ దర్జీ బాబాయ్ దగ్గరకు పరుగులు తీయడమే. భోగి నాడు బుజ్జాయిలకు భోగి పండ్లు పోస్తారు. పొలాల్లో చెరుకు గడలు చేతి కొస్తాయి. రేగి పండ్లు, చెరుకు గడల కోసం పొలాల గట్లపై తిరగటం... కనిపించలేదని అమ్మ అరవడం. ఇవన్నీ బాల్యానికి సంక్రాంతి పరిచయం చేసే మధురానుభూతులు.

పెద్దలకు నైవేద్యం

సంక్రాంతి నాడు పెద్దలను స్మరించుకోవడం గతం నుంచి ఉంది. పండుగ రోజు ఇంటిల్లిపాది కలిసి కుటుంబంలో కాలం చేసిన వారిని తలుచుకొని వారికి ఇష్టమైన పిండి వంటలు వండి నైవేద్యంగా పెడతారు. ఆర్థిక స్థోమతను బట్టి పురుషులకు పంచె, ఆడవాళ్లకు చీర కొత్త బట్టలను...వారి చిత్రపటాల ముందు పెట్టి నమస్కరిస్తారు. పిదప అందరూ కలిసి కూర్చొని భోజనం చేస్తారు. హార్థిక సంబంధాలు పూర్తిగా అడుగంటిపోతున్న ఈ రోజుల్లో కుటుంబ సభ్యులంతా కలిసి కూర్చొని భోజనం చేయడం....కుటుంబ పెద్దలను స్మరించుకొని వారిని గౌరవించుకోవడం, తల్లిదండ్రుల ఆశీస్సులు తీసుకోవడం ఇవన్నీ సంక్రాంతి మాత్రమే కల్పించిన సందర్భం. ఎక్కడెక్కడో నివశిస్తున్న అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు అందరూ కలవడం అన్నది తర్వాత తరాలకు కుటుంబ ఆత్మీయతలు, అనుబంధాల గురించి తెలియచేసే మంచి క్రతువు.

సంక్రాంతి సందళ్లు

సంక్రాంతి పండుగకు తెలుగు లోగిళ్లన్నీ సందళ్లతో, సంతోషాలతో, ఆటపాటలతో, సరదాలతో వెరసి నూతనోత్సాహాలు వెల్లివిరుస్తాయి. ముఖ్యంగా...ఇంటికి కొత్త అల్లుడు రావడం, వారికి అత్తింటివారు కొత్త బట్టలు పెట్టడం, బావల్ని మరదళ్లు ఆటపట్టించడం ఆనవాయితీ. ఇక ఈ సంక్రాంతికి కొత్త సినిమాలు అందులోనూ పెద్దహీరోల సినిమాల సందడి ప్రత్యేకం. పండగపూట ఊరికి దగ్గర్లోని టూరింగ్ టాకీస్‌కు వెళ్లడం షరామామోలే. గతంలో అయితే బంధుమిత్రులు అందరూ కలిసి ఎడ్లబండి కట్టుకొని మరీ తెరబొమ్మ చూడ్డానికి వెళ్లేవారట. ఇప్పుడు కాలం మారింది. ఇంట్లో టెలివిజన్. కావల్సినన్ని సినిమాలు. కానీ అవన్నీ సంక్రాంతి పూట బలాదూర్. ఇక అసలు సిసలైన సంక్రాంతి సరదాలంటే గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఎడ్ల పోటీలు. అవి చూడ్డానికి చుట్టు పక్క ప్రాంతాలనుండి వచ్చే జనం. సందడే సందడి. గోదావరి జిల్లాల్లో కోడి పందేల గురించి చెప్పనక్కర్లేదు. ఇతర రాష్ట్రాల నుండి కూడా బడా బడా బాబులంతా కొబ్బరితోటలు, చింత తోపుల్లో చొరబడి కోట్ల రూపాయలతో కోళ్ల పందేలు కాస్తారు. ఇంకా కొన్ని సంక్రాంతి సరదా ఆటలు కూడా ఉన్నాయి. టెంకాయాట. ఉల్లిపాయాట, నిమ్మకాయాట. సంక్రాంతి సమయంలో పొలాలన్నీ ఖాళీగా ఉంటాయి. అక్కడ కొంత మంది రైతులు ఒకచోట చేరి ఈ ఆటలు ఆడతారు. ఎవరు వీటిని తక్కువ సమయంలో ఎక్కువ దూరం విసురుతారో వారు పందెంలో గెలిచినట్టు. ఆరుగాలం పండించిన

పంట చేతికొస్తుంది. చేతిలో డబ్బులాడతాయి. అప్పటిదాకా సరదాలు సంతోషాలు తెలియని రైతులు సంక్రాంతికి మాత్రం రకరకాల పందేలు కాచి సరదాలు తీర్చుకుంటారు.

పాత మిత్రుల కలయిక

పండక్కి ఊరెందుకెళుతున్నావు అని ఎవరైనా అడిగితే. ఏమి సమాధానం చెప్పాలో తెలియక పోయినా మనస్సు మాత్రం వెంటనే ఒకటి గుర్తుచేసుకుంటుంది 'చిన్న నాటి స్నేహితుల్ని' కలవచ్చు అని. నిజమే సొంతూర్లో కట్టీకట్టని లాగులతో ఏన్నో ఏళ్లు కలిసి వాళ్లతో తిరిగుంటారు. కోతి కొమ్మచ్చిలు ఆడుంటారు. చింత చెట్లు ఎక్కుంటారు. దొంగతనంగా మామిడి పిందెలు తెంపుంటారు. ఏం చేద్దాం. కాలం విడదీసింది. బతుకు తెరువు కోసం తలో దిక్కు పోయారు. అయితేనేం...సంక్రాంతి పండుగకు అందరం కలుద్దాం అని ఫేస్‌బుక్‌లోనో, సెల్‌ఫోన్‌లోనో ముందే సమాచారం అందుతుంది . కలవాల్సిన రోజు రానేవచ్చింది. ఊరి బొడ్డురాయి దగ్గర మొదలవుతుంది కలయిక. శీనుగాడెక్కడ...సురేష్ గాడెక్కడ...రాజేష్ ఎక్కడున్నాడో ఫోన్ చేయి...నరేష్ ఇంకా రాలేదా వాట్స్ యాప్‌లో మెసేజ్ ఇవ్వు...అంటూ బోలెడన్ని ఊసులు. అంతలో బడి రమ్మని పిలుస్తుంది. ఒక్కసారిగా ఆ బడి గోడలు సెల్యూలాయిడ్‌లవుతాయి. చిన్న నాటి జ్ఞాపకాలన్నీ అందులో బొమ్మలుగా మెదులుతాయి. మిత్రులంతా కలసి గ్రామాభివృద్ధి విషయాలూ చర్చిస్తారు. అందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం పరిపాటి. ఆటల

పోటీలు, పాటల పోటీలు...క్రికెట్, కోకో, వాలీబాల్ లాంటి క్రీడా పోటీలు నిర్వహిస్తారు. మన రాష్ట్రంలో సంక్రాంతి కప్ పేరిట గత 25 ఏళ్ల నుండి ప్రకాశం జిల్లా రావినూతల గ్రామంలో మిత్రులంతా కలసి దక్షణ భారత దేశ స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. కారంచేడు, దర్శి, భీమవరం, ఇలాంటి చాలా పల్లెలు సంక్రాంతి క్రీడా పోటీలకు ఆలవాలం. సాంఘిక నాటికలనూ ప్రదర్శిస్తారు. గతంలో అయితే గ్రామంలోని కొంత మంది యువకులు కలసి పండుగ పది రోజుల ముందు నుండే కోలాటం, చెక్క భజన నేర్చుకొని పండుగ రోజు ప్రదర్శనలిచ్చేవారట. నేటికీ కొన్ని పల్లెల్లో సంక్రాంతి సాయంత్రాలు కోలాటాలు, చెక్క భజనలు, తోలు బొమ్మలాటలు వంటి జానపదుల నృత్యాలతో కోలాహలంగా కనిపిస్తుంటాయి. .

ఏడాదికి సరిపడ 'మధుర స్మృతుల' మూట

ఏడాది నుండి ఎదురు చూసిన పండుగ రానే వస్తుంది. మూడు రోజుల పండుగ మురిపిస్తుంది. ఆ మురిపెంలో మూడు రోజులు మూడు క్షణాల్లా కరిగిపోతాయి. మళ్లీ మామోలే. బతుకు జీవుడా అంటూ కడుపు చేత పట్టుకొని, కన్నతల్లిని, సొంతూరుని వదిలి ప్రయాణం. అబ్బా...పండుగ అప్పుడే

ముగ్గుల పండుగ

సంక్రాంతి అంటేనే ముగ్గుల పండుగ. నెల మొదలు నుండే ఎలాంటి ముగ్గులు పెట్టాలి. ఎన్ని చుక్కల ముగ్గులు పెట్టాలి. వాటికి ఏయే రంగులద్దాలి....అమ్మాయిల మది ఇలాంటి ఆలోచనలతో నిండిపోతుంది. మా వీధిలో అందరికన్నా పెద్ద ముగ్గు నేనే వేయాలి. అందరి ముగ్గు కన్నా నా ముగ్గే బావుండాలి. ఎన్ని ఆశలు. ఎంత స్వార్థం. ఎవరైనా నీ ముగ్గు బాగుంది అని పొరపాటున అన్నారనుకో...ఇక ఒలంపిక్స్‌లో బంగారు పతకం వచ్చినంత ఆనందం. అయినా ఒలంపిక్స్‌లో ముగ్గుల పోటీకూడా చేరిస్తే బాగుంటుందేమో! అందులో మన తెలుగు అమ్మాయిలకే అన్నీ పతకాలు. ముగ్గులు పెట్టడంలో మన వారిది అందె వేసిన చెయ్యి కదా! ఈ పప్పులన్నీ ఉడకాలంటే ఊరిలో ఉండాలి. మాస్టర్ డిగ్రీ తీసుకొని ఉద్యోగాల వేటకోసం అమీర్‌పేట్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో ఉండే అమ్మాయిలు...ప్రాజెక్ట్ వర్క్ నిమిత్తం బెంగళూరులో బస చేస్తున్న యువతులు ...వీరి పరిస్థితి ఏమిటి. కాంక్రీట్‌జంగిల్ నివాసంలో ముగ్గులు పెట్టే స్థలం ఎక్కడ. అంత సమయమెక్కడ. అందుకే సంక్రాంతికి ఊరు వెళ్లాలి. ఉన్న మూడు రోజులు అమ్మకు అసలు అవకాశం ఇవ్వకూడదు. ఇంటి ముందు పెద్ద పెద్ద చుక్కల ముగ్గు పెట్టాలి. రథం ముగ్గు వేయాలి. అమ్మ లంగా ఓణీ కట్టుకోమంటుంది. నానమ్మ చీర కట్టుకోమంటుంది. అమ్మ, నానమ్మ ఇద్దరి మాట వినాలి. ఉదయం లంగా ఓణీ, సాయంత్రం చీర. సరిపోతుంది. పెరటిలో ఉన్న కనకాంబరం చెట్లు తనకోసమే దాచిన పూలన్నీ తలలో తురమాలి. స్నేహితురాళ్లతో సరదా కబుర్లాడాలి. ఊరిలో పెట్టే ముగ్గుల పోటీలో పేరు ఇవ్వాలి. సాయంత్రం పూట నిర్వహించే కుర్చీలాటలో పాల్గొనాలి. బహుమతులన్నీ గెలుచుకోవాలి. అవన్నీ వచ్చే ఏడాది వరకూ తీపి గురుతులుగా దాచిపెట్టుకోవాలి.

అందరి బంధువు 'అరిసె'

పదమూడు జిల్లాల్లో ఏ ఊరైనా వెళ్లండి. ఎవరింటికైనా వెళ్లండి. అక్కడ మీకు అరిసెలు ఆతిథ్యం పలుకుతాయి. పేదవాడైనా, ధనవంతుడైనా ప్రతి ఒక్కరి ఇంట్లో అరిసెలు ఆరాల్సిందే. ప్రతి ఒక్కరి నోట్లో అరిసె కరగాల్సిందే. సంక్రాంతి ప్రత్యేకమైన వంటకం అరిసె. మిగతా రోజుల్లో ఈ వంటకం వినపడదు. కనపడదు. అరిసెలు తింటే ఎంత రుచిగా ఉంటాయో..అవి వండుతున్నప్పుడు చూడాలి...రెండు కళ్లకూ విందు భోజనమే. రోజూ ఎవరింట్లో వాళ్లు వండుకుంటారు. తింటారు. ఈ పండక్కి మాత్రం అరిసెలు వండాలంటే పెద్ద ప్రయాసే. అందుకే చుట్టుపక్క ఇళ్లవారందరూ కలిసి పిండి కొట్టడం దగ్గర నుండి పాకం పట్టడం, అరిసెలు వత్తడం ఈ పనులన్నీ ఒకరికొకరు చేదోడువాదోడుగా సహకరించుకుంటారు. గోదావరి జిల్లాల్లో అయితే గోర్మిటీలు, పాకుండలు, నూవుఉండలు, సున్ని ఉండలు....జంతికలు సంక్రాంతి ప్రత్యేక వంటకాలు. అనంతపురం వైపు ఈ సమయంలో రకరకాల పప్పుల పొడితో చలిమిడి చేస్తారు. కడప జిల్లాలో రాగులతో చేసే పదార్థాలు నోరూరిస్తాయి. ఇక కొత్త ధాన్యంతో పరమాన్నం...కొత్త వడ్లను దంచి అటుకులు చేయడం గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఈ పండుగకు సర్వసాధారణం. మూడో రోజు కనుమ. మాంసాహారులకు మాత్రం ఇది ముక్కల పండుగ. వేడి వేడి గారెలు, కోడికూర....నాటుకోడి పులుసు, రాగి సంకటి... ఒక్కో ప్రాంతంలో ఒక్కో రుచి. మొత్తంగా ఈ పండుగ మూడు రోజులు వండేవారికే కాదు తినేవారికీ పెద్ద పనే.

అయిపోయిందా అనిపిస్తుంది. పిల్లలు రామని మారం చేస్తారు. పెద్దల మనస్సుల్లో కూడా తెలియని అలజడి. కానీ తప్పదు. అమ్మ కట్టించిన పిండివంటల సంచులు...పప్పుధాన్యాల మూటలు, బియ్యపు గోతాలు... వారి కన్న ప్రేమకు ఈ మూటలు కొలమానాలు మాత్రం కాదు. ఉదయాన్నే పది గంటలకే ఆఫీసులో అటెండ్ కావాల్సిన అబ్బాయిగారు, ప్రాజెక్ట్ వర్క్ పక్కన పెట్టి మరీ వచ్చిన అమ్మాయి గారు, మొదటి పిరియడ్ మిస్ కాకుండా బడిబాట పట్టాల్సిన బుజ్జాయి గారు...మోయలేని మూటలతో, మనస్సంతా భారంతో అందరి అడుగులు భారంగా ముందుకు సాగుతుంటాయి. ఎక్కాల్సిన బస్సు రానే వస్తుంది. మనస్సును మాత్రం వదిలేసి...మనుషుల్ని మాత్రమే తీసుకెళ్లడానికి. ఆ బస్సు కదులుతుంటే...అమ్మ కళ్లలో కృష్ణమ్మలు

పొంగుతాయి. నాన్న గుండె చిన్నబోతుంది. తిరుగు ప్రయాణపు చిర్రుబుర్రులు మళ్లీ మొదలు. ఆపసోపాలు, ఇక్కట్లు అన్నీ భరించి ఎవరి గమ్యాలకు వారు చేరుకుంటారు. పండుగకు ఊరు వెళ్లని మిత్రులకు, అసలు పల్లెటూరే తెలియని స్నేహితులకు, ఆఫీసులో సహోద్యోగులకు అరిశెలు, అమ్మ చేతి పిండి వంటలు రుచి చూయిస్తారు. సంక్రాంతి సొంతూరు ఊసులన్నీ పంచుకుంటారు. అవి విన్నవారు, అరిసె తిన్నవారు అమ్మని, ఊరుని పొగడక మానరు. ఏడాదికి సరిపడా మధుర స్మృతుల మూటల్ని మాత్రం అలాగే మదిలో దాచుకుంటారు మళ్లీ సంక్రాంతి వచ్చేదాకా...!

◆

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

◆ సీరియల్

(భాగం -19)

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి

పారిస్, వసంత కాలం, 1948

మనం మోకరిల్లుతున్నాం గనుకే ఇతర్లు గొప్పవాళ్లుగా కనిపిస్తున్నారు. లేవండి, నిటారుగా నడుద్దాం.

(ఏలిసి లూస్టలూ)

◆ ◆ ◆

రోజంతా ప్రయాణం చేసి పారిస్ చేరుకున్నారు మార్క్స్ దంపతులు. విపరీతమైన చలిలో జరిగింది ప్రయాణం. ఏడాది ఎడ్గార్‌ను హత్తుకు కూర్చుంది జెన్నీ. ఆడపిల్లలు, మగవాళ్ల కోట్లలో దూరి చలి నుండి కాపాడుకున్నారు. దారిలో రైలు లైన్లను ధ్వంసం చేయడంతో(పారిశ్రామికీకరణకు వ్యతిరేకంగా నిరసనకారులు చేసిన చర్యయిది). ప్రయాణం మరింత ఆలస్యమైంది. అర్ధరాత్రి, రైలు బోగీల్లోంచి గుర్రపు బళ్లలోకి తరలించారు ప్రయాణికుల్ని. రైలు సజావుగా నడవగలదన్న చోట తిరిగి బోగీల్లోకి ఎక్కించారు. ప్రయాణంలో ఎన్ని ఇబ్బందులుంటేనేం, తెల్లవారి ఆ వాతావరణం చూసి ఒళ్లు పులకరించింది. ఎంత అద్భుతమైన, ఉత్తేజకరమైన దృశ్యమది! దారంతా రైల్వే స్టేషన్లలో ఎర్ర జెండాలు, ఫ్రెంచి పతాకమూ దర్శనమిచ్చాయి. ప్రభుత్వం కూలిపోయినందుకు ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారనిపించింది. అయితే, పారిస్ చేరేసరికి యుద్ధ భీభత్సం స్పష్టమైంది. రైలింజన్లు, బోగీలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. తగల పెట్టారు. పారిస్ చేరటానికి ముందు స్టేషన్ సెయింట్ డెనిస్ నగరం పూర్తిగా దగ్ధమైంది. ఇక పారిస్‌లో ఎక్కడ చూసినా విరిగిన, కాలిన దృశ్యాలే. వీధుల్లో పరచిన రాళ్లు పెకలించి బారికేడ్లు కట్టారు. కాలుతున్న బళ్లను రోడ్ల మీద అడ్డంగా పెట్టారు. ఇళ్ల కప్పుల మీద విరిగిన ఫర్నిచర్ కనిపించింది. తల్లకిందులైన బళ్లు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. రాజ భవనం కిటికీలు బద్దలై కనిపించాయి. ఎదురుగా వున్న గార్డ్ హౌజ్ నల్ల బొగ్గుగా మారింది. లోపలి గార్డుల్ని సజీవ దహనం చేసినట్టే ఉంది.

మూడేళ్ల క్రితం 1845లో తామిక్కడున్నప్పుడు జెన్నీ, మార్క్సులు చూసిన పారిస్ కాదు ఇది. కాని ధ్వంసమైతేనేం ఇప్పుడిది స్వేచ్ఛా నగరం. విముక్త నగరం...కనీసం పురుషులకు. మార్క్స్ దంపతులు అక్కడికి చేరిన రోజే, పురుషులందరికీ ఓటింగ్ హక్కు లభించింది. ఇప్పుడు వాళ్లకు అరెస్టు భయం లేదు. అక్కడి ప్రముఖ వ్యక్తులందరూ స్నేహితులూ, అనయాయులే. మార్క్స్ మిత్రుడు జాక్ ఇంబెర్ట్ ఇప్పుడు గవర్నర్. మరో మిత్రుడు పోలీసు ఉన్నతాధికారి. విడుదలైన రాజకీయ ఖైదీలతో సివిల్ గార్డ్ ఏర్పాటు చేసే పనిలో ఉన్నాడు. ఎంగెల్స్ మాటల్లో ఈ కాలం "రిపబ్లికన్ హనీమూన్". ఎండిపోయిన బ్రెడ్డు, బంగాళా దుంపలు మాత్రమే తిని కడుపు నింపుకుంటున్న నగరం. "తాము నరికేసిన చెట్ల స్థానంలో వీధుల్లో ఇరువైపులా స్వేచ్ఛా వృక్షాలు" నాటుతున్నారు. సాయంత్రాలు వినోదాలతో, పాటలు, నాట్యాలతో గడిచాయి.

పారిస్ చేరిన రోజు , మార్క్స్ దంపతులకు ఉండటానికి గది దొరకలేదు. ఈ సంబరాలు చూడటానికి అందరూ అక్కడికి చేరడంతో లాడ్జింగులన్నీ నిండిపోయాయి. చివరికి జర్మన్ సోషలిస్టులకు వసతి కల్పించే ఒక యింట్లో తల దాచుకున్నారు. గదిలో లగేజి పెట్టారో లేదో మార్క్స్ పాత మిత్రులను, కొత్త తాత్కాలిక ప్రభుత్వ ప్రతినిధులనూ కలవటానికి బయల్దేరాడు మార్క్స్. బకూనిన్ కూడా అక్కడే ఉన్నాడు. ఆ ఆనంద సందోహంలో పాలు పంచుకోవాలనే అందరి కోరిక.

1789 నాటి ఫ్రెంచ్ విప్లవ కాలం నుండే పారిస్ యింత ఉద్రిక్తంగా, ఉన్మత్తంగా ఎప్పుడూ లేదు. ఈ వాతావరణాన్ని 'కళాత్మకంగా' అధ్యయనం చెయ్యడానికి రూన్ నుండి వచ్చాడు గుస్తావ్ ఫ్లోబెర్ (ప్రసిద్ధ ఫ్రెంచి నవలా రచయిత 'మదాంబావరీ' రాసిందీయనే), జార్జి సాండ్

(మరో ప్రముఖ రచయిత్రి) గృహ మంత్రిత్వ శాఖ వారి కోసం బులెటిన్లు రాస్తోంది. విక్టర్ హ్యూగోను విద్యా శాఖ మంత్రిగా ఉండమని కోరింది కొత్త ప్రభుత్వం (ఆయన నిరాకరించాడు). ఒక టేబులు, రెండు కుర్చీలుంటే చాలు, అక్కడో "పొలిటికల్ క్లబ్బు" పుట్టు కొచ్చింది. విడాకులు చట్ట బద్ధం చేయాలని మహిళా గ్రూపులు ప్రచారం చేశాయి. మహిళల హక్కుల కోసం పసుపు పచ్చ పోస్టర్లు నగరమంతా వెలిశాయి. ఈ హక్కుల కోసం మహిళా మేధావులు పోరాడారు.

కాని విప్లవంలో పాల్గొన్న పురుషులే వీళ్లను సమర్ధించలేదు (ఆనాటి ఫ్రెంచి సోషలిస్టులు మహిళా హక్కుల వ్యతిరేకులన్నది జగద్విదితం). వార్తా పత్రికల సంఖ్య ఎంతగా పెరిగిందంటే, ఒక పారిస్ నుండే 171 పత్రికలు వెలువడ్డాయి మొదటి రోజునే. పత్రిక ప్రారంభించమని ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఒక మిత్రుడు ధన సహాయం ప్రకటించారుగాని మార్క్స్ నిరాకరించాడు. అన్ని ప్రభుత్వాల నుండీ రిపబ్లికన్ ప్రభుత్వం నుండి కూడా దూరంగా ఉండాలనుకున్నాడు. పైగా పారిస్ విప్లవం లాంటిది జర్మనీలో జరగటానికి కృషి చేస్తున్నప్పుడు లీగ్ నాయకులు లండన్ నుండి పారిస్ చేరుకున్నారు. "మేధో చర్చలకు ఇది సమయం కాదు. అందరూ ఉద్యమంలో భాగం కావాల్సిందే" అన్నాడు ఎంగెల్స్.

ఈ 'సామాన్యుని వసంత కాల గర్జన' పారిస్‌కు మాత్రమే పరిమితం కాలేదు సరికదా జర్మన్ సమాఖ్యలోని అనేక నగరాలకూ విస్తరించింది. యూరప్‌లో జరిగినట్టే జర్మనీలోని ముప్పైతొమ్మిది ప్రాంతాల్లో వ్యవసాయం బాగా దెబ్బతింది. 1844 నుండీ ఆహార పదార్థాల ధరలు బాగా పెరిగాయి. ఇంచు మించు అన్ని రాష్ట్రాల్లో ఆకలి దాడులు జరుగుతున్నాయి. అప్పటికి జర్మనీ యింకా వ్యవసాయిక దేశమే. కాని వచ్చిన కొద్ది పరిశ్రమలు కూడా వృత్తి కార్మికులకు శాపంగా పరిణమించాయి. ఫ్యాక్టరీల్లో పనిచేయడానికి వీళ్లెవరూ ఇష్టపడలేదు.

సమాఖ్యలోని అతి పెద్ద రాష్ట్రం– అత్యంత జనాభా కలిగిన రాష్ట్రం– ప్రష్యాలో సమస్యలు కూడా అత్యంత తీవ్రంగా ఉన్నాయి. అయినా పారిస్ పరిస్థితులు ఇక్కడ పునరావృతం కావటానికి కనీసం ఓ ఏడాదైనా పడుతుంది. అది కూడా ఆస్ట్రియాకు చెందిన ప్రిన్స్ మెట్టర్‌నీష్ పతనం తర్వాత. యూరోపియన్ ప్రభుత్వాల రియాక్షనరీ స్వభావానికి ప్రతీక మెట్టర్ నీష్. ప్రష్యా, ఆస్ట్రియా, రష్యాల రియాక్షనరీ సమాఖ్య ఏర్పడటానికి ఈయనే కారణం. ఈయన కేవలం ఆస్ట్రియన్ ఛాన్సలర్ మాత్రమే అయినా సమాఖ్యకు ప్రాతినిధ్యం వహించినట్టుగా ప్రవర్తించాడు.

ఫ్రెంచ్ విప్లవం తర్వాత, ఆస్ట్రియాలో కూడా ఏదో జరగక తప్పదనే అనుకున్నారందరూ. అంతకు ముందరే, తమకు తాము వుదారవాదులమే కాని రాడికల్స్ కాదని చెప్పుకున్న వైద్య విద్యార్థులు కొందరు, పత్రికా స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, రాజ్యాంగం వగైరా కావాలని రాజుగారు ఫెర్డినాండ్‌కు అర్జీ పెట్టుకున్నాడు. ప్రభుత్వం ఈ డిమాండ్‌ను తిరస్కరించడంతో వేలాది మంది ప్రదర్శనగా పార్లమెంట్‌కు బయల్దేరారు. సైన్యం అడ్డుకుని కాల్పులు జరపడంతో పదిహేను మంది మరణించారు. ఆ తర్వాత. నేషనల్ గార్డ్ కూడా ప్రతిపక్షాలతో చేయి కలిపింది.

మెట్టర్‌నీష్ రాజీనామా చేసి మారు వేషంలో ఇంగ్లండుకు పారిపోయాడు. ప్రదర్శన కారులు వియన్నా (ఆస్ట్రియా రాజధాని)ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆస్ట్రియా సామ్రాజ్యంలోని ఇతర ప్రాంతాలు బుడాపెస్ట్, ప్రాగ్, వెనిస్ స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాయి. ఇటలీలోని మిలాన్‌లో ఆస్ట్రియాకు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది.

"సమాఖ్యలోని అతి పెద్ద రాష్ట్రం- అత్యంత జనాభా కలిగిన రాష్ట్రం- ప్రష్యాలో సమస్యలు కూడా అత్యంత తీవ్రంగా ఉన్నాయి. అయినా పారిస్ పరిస్థితులు ఇక్కడ పునరావృతం కావటానికి కనీసం ఓ ఏడాదైనా పడుతుంది. అది కూడా ఆస్ట్రియాకు చెందిన ప్రిన్స్ మెట్టర్‌నీష్ పతనం తర్వాత. యూరోపియన్ ప్రభుత్వాల రియాక్షనరీ స్వభావానికి ప్రతీక మెట్టర్‌నీష్."

మార్చి16 నాటికి వియన్నా తిరుగుబాటు వార్తలు బెర్లిన్‌కు చేరాయి. పారిస్ వార్తలతో అప్పటికే అక్కడ అల్లర్లు చెలరేగాయి. నిరుద్యోగ సమస్య, దుర్భర దారిద్ర్యంతో ప్రజల కోపం కట్టలు తెంచుకుంది. లూటీలకు తెగబడ్డారు. వియన్నా ప్రేరణతో ఈసారి తిరుగుబాటు మరింత పకడ్బందీగా జరిగింది. సంస్కరణలకు అంగీకరించాడు ప్రష్యన్ రాజు.

మొదట సెన్సార్ షిప్ రద్దయింది. మంత్రి వర్గం రాజీనామా చేసింది. పార్లమెంట్‌ను సమావేశ పరిచారు. అందరూ కలిసి సమైక్య జర్మనీ కోసం కృషి చెయ్యాలన్నారు. బాల్కనీలో దర్శనమిచ్చిన రాజుగారికి కృతజ్ఞతలు చెప్పారు ప్రజలు. కాని


మెట్టర్‌నీష్

అప్పటికే అక్కడ గుర్రాల మీద సైనికులు ప్రాంగణంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అరుపులు, కేకలతో గోలగోలగా ఉంది వాతావరణం. అంతలో తుపాకులు గర్జించాయి. రాజు గారే సైన్యాన్ని వుసికొల్పాడనుకున్నారు జనం. "ద్రోహం చేశాడు" అన్న నినాదాలు మిన్నంటాయి. "ఆయుధాలు చేపట్టండి!" అంటూ అరిచారు.

వీధుల్లోని రాతి బండలు బారికేడ్లుగా మారాయి. చిన్నా, పెద్దా లేకుండా అందరూ చేతికి దొరికింది దొరికినట్టు తీసుకొని యుద్ధానికి కదిలారు.

తెల్లవారాక కాల్పులు ఆపమని సైన్యానికి ఆదేశాలిచ్చాడు రాజు. ప్రజలతో యుద్ధమంటే పదవికే ముప్పు. సోమవారం మధ్యాహ్నం వరకు వుద్రేకాలు తగ్గి శాంతి నెలకొంది.

రాజ్యాంగబద్ధ పాలన సాగిస్తానన్నాడు రాజు. అంటే రాజరికం అంతమైంది. ఇప్పుడు ప్రష్యన్లు పాలితులు కారు, పౌరులు.

బెర్లిన్ సమాచారం తెలిసిన పారిస్‌లోని జర్మన్ సోషలిస్టులు, కమ్యూనిస్టులు స్వదేశానికి తిరిగి వెళ్లడానికి సన్నాహాలు చేసుకున్నారు. హెర్వెగ్ ఒక జర్మన్ దళంతో దక్షిణ జర్మనీలోకి జైత్రయాత్ర చేయాలనుకున్నాడు. వేలాది మంది వాలంటీర్లు ఆతృతగా నిరీక్షించారు. ఫ్రెంచ్ ప్రభుత్వం ఆర్థిక సహాయం కూడా చేసింది.

కాని ఫ్రాన్స్ చేస్తున్న ఈ సాయం వెనుక జర్మన్లను వదిలించుకోవాలన్న ప్రభుత్వ కుట్ర దాగి ఉందనుకున్నాడు మార్క్స్. ఫ్రాన్స్‌లో ఉద్యోగాల కొరత ఉంది.

హెర్వెగ్ జైత్ర యాత్రను మార్క్స్, ఎంగెల్స్ తీవ్రంగా వ్యతిరేకించారు అక్కడ. యుద్ధం జరిగితే వీళ్ల పరాజితులు కావడం తథ్యం. పైగా ఇంత మంది జర్మనులు రావడం వెనుక ఫ్రెంచి హస్తముందనుకొని జర్మను సంప్రదాయవాదులు ఏకమయ్యే ప్రమాదముంది. ఈ విషయాన్నే ఒక సమావేశంలో మార్క్స్ చెప్పినప్పుడు అందరూ ఆయన మాటలకడ్డుపడి అవమానించినంత పని

చేశారు. కొందరు కమ్యూనిస్ట్ లీగ్ సభ్యులు కూడా వాళ్లతో జతగలిశారు (ఈలోగా ఒక పత్రిక సంపాదకుడు ఫోకాన్, పోలాండ్‌లో కూడా తిరుగుబాటు జెండా ఎగరెయ్యాలని, బకూనిన్‌కు 2000 ఫ్రాంకులు, రెండు పాస్ పోర్టులూ ఇచ్చి అక్కడికి పంపాడు). తనను వ్యతిరేకించిన వాళ్లను లీగ్ నుండి బహిష్కరించాడు మార్క్స్. ఆ తర్వాత మరో సంస్థ, జర్మన్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేశాక అందరూ 'ఎర్ర రిబ్బన్' కట్టుకోవాలని కూడా సూచించారు. 'మామూలు ఎరుపు కాదు. నెత్తుటి ఎరుపు' కావాలన్నాడు షాపర్.

ఇక, తాను స్వయంగా జర్మనీలోకి ప్రవేశించటానికి సన్నాహాలు చేసుకున్నాడు మార్క్స్. అయితే, మార్క్స్ అనుయాయులు హెర్విగ్ లీజిన్ సైనికుల్లా కాక, ప్రచారకులుగా జర్మనీలోకి ప్రవేశిస్తారు. మూకుమ్మడిగా అందరూ ఒకేసారి దండెత్తరు. ఒక్కొక్క గ్రూపులో కొద్ది మంది మాత్రమే ఉంటారు. జర్మన్ సమాఖ్యలో కమ్యూనిస్టు బీజాలు నాటడమే వాళ్ల లక్ష్యం.

నిజానికి ప్రచార కార్యక్రమం అప్పటికే ప్రారంభమైందనవచ్చు. మార్చి 17నాడు జర్మనీలో ఉన్న వైడిమీయర్‌కు జెన్నీ రాసిన లేఖలో మార్క్స్ జర్మన్ వర్కర్స్ యూనియన్‌కూ, హెర్విగ్ సైన్యానికీ ఉన్న తేడాల గురించి స్థానిక పత్రికల్లో స్పష్టత ఇవ్వాలని కోరింది. అసలు జర్మనీ చేరకుండానే హెర్విగ్ దళంలో బీటలు రావటం ఖాయమన్నాడు ఎంగెల్స్.

ఏప్రిల్ 1నాడు ఖడ్గాలు, తుపాకులు ధరించిన వెయ్యి మంది తిరుగుబాటు దారులతో హెర్విగ్ దళం జర్మనీలోకి ప్రవేశించింది. ఫ్రెంచి సరిహద్దులో అందరూ ఘనంగా వీడ్కోలు చెప్పారు. ఇరవై అయిదు రోజుల తర్వాత, ఈ సైనికులంతా తొలి యుద్ధంలోనే తుడిచి పెట్టుకుపోయారు.

పారిస్‌లో సుమారు ఎనభైవేల మంది జర్మన్ శరణార్థులుంటున్నారు. ఫ్రెంచి ప్రభుత్వ సహాయసహకారాలతో, మార్క్స్ యూనియన్ సభ్యులు నాలుగు వందల మంది ఏప్రిల్ ప్రారంభంలో పారిస్‌ను వదిలి స్వదేశానికి పయనమయ్యారు. ఎంగెల్స్, తొలత తను సైన్యంలో పని చేసిన వప్పెర్‌టాల్‌కు, విల్హెల్మ్‌వూల్ఫ్ బ్రెస్లాకు, షాపర్ వైస్ బాడెన్‌కు, మార్క్స్ కొలోన్‌కు వెళ్లాలి.

స్వదేశంలో వాళ్లనెవరూ అడ్డుకోలేదు. అందరి దగ్గరా 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' మార్క్స్, ఎంగెల్స్ రాసిన "జర్మన్ కమ్యూనిస్ట్ పార్టీ డిమాండ్లు" కరపత్రాలున్నాయి.

మార్క్స్, జెన్నీ, ముగ్గురు పిల్లలు లెంచెన్, ఎంగెల్స్ ఏప్రిల్ ఆరున పారిస్ నుండి బయల్దేరారు.

కొలోన్, 1848

ఐదేళ్ల తర్వాత తిరిగి వచ్చిన మార్క్స్ దంపతులకు కొలోన్ పెద్దగా మారలేదనిపించింది. వ్యాపారస్తులు, ప్రభుత్వం పట్ల అసంతృప్తిగానే ఉన్నారు. కార్మికులు ఇంకా దోపిడీకి గురవుతున్నామనే అనుకుంటున్నారు. మార్పులేమైనా వచ్చాయంటే, అవి కేవలం గత నెలలోనే. సెన్సార్ షిప్ తొలగించారు. ఆంక్షలు లేకుండా రచయితలు ఇప్పుడేమైనా రాసుకోవచ్చు. మార్క్స్ పాత మిత్రులు మోజెస్ హెస్, జార్జి వీర్త్, హైన్రిష్ బర్గర్స్, ఆ నాటి పత్రికకు కొనసాగింపుగా 'న్యూ రైనిష్ జైటుంగ్' ప్రారంభించాలనుకుంటున్నారు. వార్తా పత్రిక అంటే మార్క్స్‌కు చేతిలో ఆయుధం. ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసి ఆనందించాడు. తనిక్కడికి చేరడానికి నెలరోజుల ముందే , కొలోన్‌లో కమ్యూనిస్టు సంస్థకు బీజం పడింది.

" జైలు నుండి విడుదలైన వెంటనే కొందరు కార్యకర్తలు, కొలోన్‌లో ఒక కార్మిక వర్గ గ్రూపు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ నాటికి సభ్యుల సంఖ్య ఎనిమిది వేలకు పెరిగింది. కాని, వ్యూహాత్మక విషయాల గురించి గాట్‌బాక్‌తో తీవ్రంగా విభేదించాడు మార్క్స్. ఉద్వేగ భరితమైన, తీవ్ర పదజాలంతో కార్మికుల హక్కుల గురించి, ఏర్పాటు కాబోయే 'ప్రజా సైన్యం' గురించి అందర్నీ భయభీయులను చేసేలా ఉపన్యసించడం ఆయన కిష్టం. "

మార్చ్ మూడున ఒక పేదవాళ్ల డాక్టర్ ఆంద్రియాస్‌గాట్‌బాక్ మరో ఇద్దరు మాజీ ప్రష్యన్ సైనికాధికారులతో కలిసి ఒక కమ్యూనిస్టు తిరుగుబాటుకు ప్రయత్నించాడు. అయిదు వేల మంది ఇందులో పాల్గొన్నారు. అప్పటికైతే అందర్నీ అరెస్టు చేశారుగాని, సంస్థ అప్పటికే ప్రజలతో సంబంధాలు పెంచుకుంది. జైలు నుండి విడుదలైన వెంటనే కొందరు కార్యకర్తలు, కొలోన్‌లో ఒక కార్మిక వర్గ గ్రూపు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ నాటికి సభ్యుల సంఖ్య ఎనిమిది వేలకు పెరిగింది. కాని, వ్యూహాత్మక విషయాల గురించి గాట్‌బాక్‌తో తీవ్రంగా విభేదించాడు మార్క్స్. ఉద్వేగ భరితమైన, తీవ్ర పదజాలంతో కార్మికుల హక్కుల గురించి, ఏర్పాటు కాబోయే 'ప్రజా సైన్యం' గురించి అందర్నీ భయభీయులను చేసేలా ఉపన్యసించడం ఆయన కిష్టం. ఈ రకమైన 'కమ్యూనిస్టు భవిష్యత్ చిత్రపటం' చూసి మధ్య తరగతి వాళ్లు



గజగజా వణికిపోయారు. ఇటీవలే అతి కష్టం మీద రాజరిక పతనంతో గెల్చుకున్న హక్కుల్ని ఇక అధిక సంఖ్యాకులైన కార్మికులు హరిస్తారని భయపడ్డారు. మార్పు జరుగుతున్న క్రమం చాలా నెమ్మదిగా వున్న మాట నిజమే కాని చరిత్ర పరిణామం ఇలాగే ఉంటుంది. కార్మిక నియంతృత్వానికి ముందు మధ్య తరగతి పాలన రాక తప్పదని మార్క్స్ అవగాహన. అంతేకాక, అప్పటికి కార్మిక వర్గం(జర్మనీలో) బలంగా లేదు. కాయకష్టం చేసే వాళ్ల సంఖ్య తక్కువుందని కాదు. కానీ వాళ్లింకా సంఘటితం కాలేదు. తమ శక్తిని గుర్తించగలిగిన చైతన్యం వాళ్లలో రాలేదు. ఈ లక్ష్యం సాధించాలంటే "మధ్య తరగతి ప్రజాస్వామ్యం" అవసరమని నమ్మాడు మార్క్స్. ఇవి దృష్టిలో పెట్టుకుని, రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామిక అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నాడు. రియాక్షనరీలు విజయం సాధిస్తే, ఇప్పటికి జరిగిన సంస్కరణలన్నీ ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుంది. అందువల్ల తన మిత్రులు ప్రారంభించబోయే వార పత్రిక ప్రజాస్వామిక లక్ష్యాల కోసం(కమ్యూనిస్టు లక్ష్యాల కోసం కాదు)మాత్రమే పనిచేయాలి. అప్పటికి, జర్మనీలో ప్రజాస్వామ్య భావజాలానికున్న ప్రాచుర్యం, కమ్యూనిస్టు భావజాలానికి లేదు. ఒక వేళ మిత్రులు వాళ్లకు నచ్చిన నిర్ణయాలే తీసుకోవాలనుకుంటే "అతి కొద్ది మందికి కమ్యూనిజం బోధించాలి. అందుకోసం కర పత్రంచాలు. కాని కార్యోన్ముఖమైన గొప్ప పార్టీ నిర్మాణం మాత్రం సాధ్యం కాదు" అన్నాడు ఎంగెల్స్.

మార్క్స్ పాత మిత్రులు అతడు మెత్తబడ్డాడన్నారు. కాని ప్రభుత్వం దృష్టిలో అతడు 'ప్రమాదకరమైన రాడికల్'. మార్క్స్ ముందున్న అసలు సమస్య మరొకటి. తను మెత్తబడినా, పడకపోయినా, పౌరసత్వాలు లేనంతకాలం 'బహిష్కరణ' ఖడ్గం తన మీద వేలాడుతూనే ఉంటుంది. ఈ విషయం తేలిందాకా తాను ట్రేయర్‌లోనే ఉంటానన్నది జెన్నీ. కాని పరిష్కారం కనుచూపు మేరలో కనిపించక పోవడంతో జూన్‌లో, పిల్లల్తో కొలోన్‌కు బయల్దేరింది.

సశేషం

▪ ఫోన్: 91776 18708

సంక్రాంతి స్పెషల్స్

పొంగలి

కావలసిన పదార్థాలు

బియ్యం – అరకప్పు, బెల్లం – అరకప్పు, పాలు – అన్నం ఉడికించడానికి సరిపడా, ఎండుద్రాక్ష, జీడిపప్పు, బాదం పలుకులు – పావుకప్పు నెయ్యి – అరకప్పు, యాలకుల పొడి – అరస్పూన్

తయారీ విధానం

బియ్యం కడిగి పావు కప్పు పాలు పోసి ఉడికించాలి. కొద్ది సేపటి తర్వాత మరికొద్దిగా పాలు కలిపి సన్న మంట మీద ఉడికించాలి. అన్నం పూర్తిగా ఉడికాక బెల్లం తురుము కలపాలి. బెల్లం పూర్తిగా కరిగాక స్టౌమీద నుండి దింపి నేతిలో వేయించిన జీడిపప్పు, బాదంపలుకులు, ఎండుద్రాక్ష కలపాలి. చివరిలో మిగిలిన నెయ్యి మొత్తం వేసి యాలకుల పొడి చల్లితే చాలు . ఘుమఘుమలాడే పొంగలి సిద్ధం.

అరిసెలు

కావలసిన పదార్థాలు

బియ్యం – కేజీ, బెల్లం – ముప్పావుకేజీ, నువ్వులు – 100 గ్రాములు, నెయ్యి – 1 కప్పు, నూనె – వేయించడానికి సరిపడా

తయారీ విధానం

బియ్యం రాత్రి నానబెట్టుకోవాలి. బియ్యంలో నీళ్లన్నీ వంపి పిండి పట్టించుకోవాలి (కొట్టిన పిండైతే బాగుంటుంది). ఈ పిండి తడారిపోకుండా చూసుకోవాలి. బెల్లం పొడి చేసి అందులో కొద్దిగా నీళ్ల పోసి ముదురు పాకం పట్టుకోవాలి (అంటే పాకం నీళ్లల్లో వేస్తే టంగ్‌మని మోగాలి). పాకం రాగానే అందులో నువ్వులు కలపాలి. వెంటనే స్టౌమీద నుండి దింపి అందులో బియ్యం పిండి కలపాలి. పిండి కలిపేటప్పుడు ఉండలు కట్టకుండా జాగ్రత్తగా కలపాలి. అందులోనే నెయ్యివేసి కలపాలి. పిండిని చిన్న చిన్న ఉండలు చేసి ప్లాస్టిక్ కవర్ మీద అరిసెల్లా వత్తుకోవాలి. వీటిని కాగిన నూనెలో వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. బయటికి తీసి అరిసెల గంటెలతో నూనె వత్తి కొద్దిగా ఆరబెట్టాలి. అంతే పిన్నా పెద్దా అందరూ ఇష్టపడే అరిసెలు రెడీ.

గారెలు

కావలసిన పదార్థాలు

మినపప్పు – పావుకేజి, ఉల్లిగడ్డలు – 2 పెద్దవి, పచ్చిమిర్చి – 10, అల్లం – అంగుళం ముక్క, ఉప్పు – రుచికి సరిపడా, కరివేపాకు – 2 రెమ్మలు, కొత్తిమీర – 1 కట్ట, జీలకర్ర – 2 స్పూన్లు, నూనె – వేయించడానికి సరిపడా

తయారీ విధానం

మినపప్పును రెండు గంటలు నానబెట్టాలి. నానిన మినపప్పును కచ్చాపచ్చాగా రుబ్బి అందులో కోసిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, అల్లం ముక్కలను వేయాలి. అందులోనే కరివేపాకు, కొత్తిమీర, ఉప్పు వేసి మెత్తగా రుబ్బాలి. చివరిలో జీరకర్రవేసి కలపాలి. రుబ్బుకున్న గారెల పిండిని చిన్న చిన్న వడలాగా చేసి కాగుతున్న నూనెలో వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. కనుమరోజు అందరూ గారెలతో నాటుకోడి కూరని ఎంతో ఇష్టంగా తింటారు.

చకిలాలు

కావలసిన పదార్థాలు

బియ్యంపిండి–అరకిలో, పచ్చిమిర్చి పేస్ట్ – ఒక టేబుల్ స్పూన్, అల్లం వెల్లుల్లి పేస్ట్– అర టీ స్పూను, నువ్వులు– ఒక టేబుల్ స్పూను, జీలకర్ర – ఒక టేబుల్ స్పూను, వెన్న – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు– రుచికి సరిపడా. నూనె– వేయించడానికి సరిపడా.

తయారీ విధానం

బియ్యం పిండిలో నువ్వులు, జీలకర్ర, పచ్చిమిర్చి పేస్ట్, అల్లం వెల్లుల్లి పేస్ట్, వెన్న వేసి ... తగినంత నీటిలో చపాతీ పిండిలా కలుపుకోవాలి. తర్వాత చిన్న చిన్న వుండలు చేసి తడిబట్ట మీద చేతితో వడి తిప్పుతూ చకిలాలు పెట్టుకోవాలి. తర్వాత వీటిని నూనెలో ఎర్రగా వేయించుకోవాలి.

నాటుకోడి కూర

కావలసిన పదార్థాలు : నాటుకోడి – 1, ఉల్లిపాయలు – 300 గ్రా, పచ్చిమిర్చి – 4, అల్లంవెల్లుల్లి – 2 స్పూన్లు, గసగసాలు – 3 టీ స్పూన్లు, జీలకర్ర – 2 టీ స్పూన్లు, గరం మసాలా – అర టీ స్పూను, ఎండుమిర్చి – 6, పండుమిర్చి – 4, మెంతులు – 1 టీ స్పూను, ఆవాలు – 1 టీ స్పూను, నిమ్మకాయ – 1, కొత్తిమీర – 1కట్ట, ఉప్పు – తగినంత, నూనె – తాలింపుకు

తయారీ విధానం : నాటు కోడి ముక్కలకు కొంచెం ఉప్పు, వెల్లుల్లి, పసుపు కలిపి అరగంట సేపు నానబెట్టాలి. గిన్నెలో నూనె వేసి కాగిన తర్వాత నానబెట్టిన కోడి ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, మిర్చిముక్కలు, ఉప్పు వేసి మూత పెట్టి మెత్తబడేవరకు ఉడకబెట్టాలి. తర్వాత గసాలు, జీలకర్ర, గరం మసాలా, ఎండు మిర్చి, వేయించి ముద్దగా నూరాలి. దీన్ని ఉడుకుతున్న కూరలో వేసి కలపాలి. పండు మిరపకాయల్ని నిలువుగా కోసి అందులో వేయాలి. నూరిన ఆవాలు, మెంతుల ముద్దను కూడా వేసి పావుగంట ఉడికించాలి. దించాక నిమ్మరసం పిండాలి.



ఏమేంటి?

ఇక్కడ ఏడు రకాల నాట్య భంగిమలున్నాయి. పేర్లు చెప్పకోండి చూద్దాం.

జవాబు: ఎ. మణిపురి, బి. కూచిపూడి, సి. ఒడిస్సీ, డి. భాంగ్రా, ఇ. కథాకళి, ఎఫ్. మోహినియాట్టం, జి. భరతనాట్యం.

ఆరు తేడాలు చెప్పండి

ఏ పండు గిన్నె ఏది?



ఇక్కడ ఐదు పళ్లు, ఐదు గిన్నెలు వున్నాయి. అక్కడ ఇచ్చిన అంకెలు, లెక్కల ఆధారంగా ఏ పండు ఏ గిన్నెలో వుండాలో గుర్తు పెట్టండి.

ఏమేం వున్నాయి?



మూడు ప్రాణులను కలిపితే ఈ వింత జీవి తయారైంది. ఇంతకీ ఇందులో ఏమేం వున్నాయో చెప్పండి?

జవాబు: బాతు కాళ్లు, కోడిపిల్ల మొండెం, కుందేలు తల.

నాలుగు త్రికోణాలు



అగ్గిపుల్లలతో 8 త్రికోణాలు చేశారు. కేవలం మూడంటే మూడు పుల్లలను కదిల్చి... నాలుగు త్రికోణాలు మాత్రమే వుండేలా చేయండి చూద్దాం.

రంగులు అద్దేద్దాం



దారి కనుక్కోండి

నీడ ఏదబ్బా...



కొండ మీది నుంచి సైకిల్ డొల్ల పుచ్చకాయలా దొర్లుకుంటూ వస్తోంది కదా.
ఈ సైకిల్ నీడ కింద వుంది. సరైన నీడ ఏదో చెప్పకోండి చూద్దాం.

ఎలుగు బంటి బొమ్మ వేద్దామా!



ఏది పెద్ద గీత?



ఈ రెండు గీతల్లో ఏది పెద్దదో చెప్పాలి. అలా చూసి కాదు.
స్కేలుతో కొలిచాకే చెప్పండే.



జవాబు: రెండూ సమానమే

◆ కొత్త పుస్తకాలు

దొడ్డపనేని జ్ఞాపకాల ఊట

తన జీవన సహచారి కీ॥శే శ్రీమతి దొడ్డపనేని కమలకు రచయిత రామారావు గారు ఈ గ్రంథాన్ని అంకితం చేసారు. వీరు స్వాతంత్ర్య సమరయోధులుగా, కమ్యూనిస్ట్‌గా నీతి, నిజాయితీ నిబద్ధతగల మార్క్సిస్ట్ కార్యకర్త-నాయకులుగా ప్రసిద్ధులు. 1927 డిసెంబర్ 8 కృష్ణాజిల్లా కంచికచర్లలో దొడ్డపనేని వెంకటప్పయ్య, లక్ష్మీనరసమ్మ దంపతులకు రామారావు జన్మించారు. 1946లో ఆయన కమ్యూనిస్టు పార్టీ రాజకీయాల వైపు మొగ్గు చూపారు. సత్యాగ్రహ ఉద్యమం, వామపక్ష రాజకీయల్లో పనిచేశారు. 1947 నవంబర్ 12వ తేదీన నిజాం నవాబు ఏలుబడిలో ఉన్న పరిటాల పరగణాకు చెందిన పోలీస్ స్టేషన్‌మీద సహచరులతో కలిసి దాడి చేసారు. ఆయుధాలు స్వాధీనం చేసుకోవడం ...1948 లో అరెస్ట్ అవడం.. లాంటి వీరోచిత ఘట్టాలు ఈ పుస్తకం ప్రతిపుటలో పాఠకున్ని రోమాంచితుల్ని చేస్తాయి. "జీ" న్యూస్ వీక్లీ ఈ పుస్తకం ప్రచురించింది. దొడ్డపనేని అనగానే పొగాకు కూలీలు, రైతు ఉద్యమం గుర్తు కొస్తాయి. 2004 లో కేంద్ర ప్రభుత్వం ఆయనను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించింది. ఎప్పటికైనా కమ్యూనిస్టు పార్టీల కార్యసాధన వల్లే పేదల కష్టాలు శాశ్వతంగా పోతాయని, సమ సమాజం వస్తుందని దొడ్డపనేనికి దొడ్డ నమ్మకం. మార్క్సిజంపై అచంచల విశ్వాసంగల వ్యక్తి. భూతకాలపు విజ్ఞానం భూస్థాపితం కాకుండా భావి తరాలకు అందించాలన్న ఆయన తపనే ఈ పుస్తక రచన. కొన్ని అధ్యాయాలు చదువుతుంటే ఓస్ట్రోవ్‌స్కీ "కాకల తీరిన యోధుడు" రచన గుర్తుకొస్తుంది. రేపటి తరం యువకులకు నాటి కమ్యూనిస్టు యోధుల త్యాగాలు, జైళ్ళలో నిర్బంధాలు, దాడులు, ఆస్తులు సర్వం కోల్పోయి, విలువైన జీవితాన్ని కుటుంబ జీవనాన్ని త్యాగం చేసిన వారి జీవన శైలి తప్పక తెలుసుకోవాలి. 1968 వ సంవత్సరం ఫిబ్రవరి 24 వ తేదీన కంచికచర్ల కోటను సజీవ దహనం (పేజీ 43) క్రూర ఘోర కృత్యాన్ని " మానని గాయం" గా వర్ణించి ఆ విషాదాన్ని అక్షర బద్ధం చేసిన తీరు ఆలోచింపజేస్తుంది. సొంత ఇల్లు, సెంటు భూమి లేని దొడ్డపనేని రామారావు నిబద్ధతగల సిపిఎం కార్యకర్త. నేటి తరానికి ఆదర్శప్రాయం. 1973 ప్రాంతంలో కాపు, కమ్మ కుల తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక తగాదాలు, కంచికచర్ల కో ఆపరేటివ్ సొసైటీ స్థితిగతులు, పంచాయితీ బోర్డు ఎన్నికలు, తన బిడ్డలకు చేసిన ఆదర్శ వివాహాలు, ప్రయాణ సౌకర్యాలు (పేజీ 83) ఉభయ కమ్యూనిస్టు పార్టీల సమావేశాలు, ఉద్యమాలు రైతు పోరాటాలు ఇలా ఎన్నో విషయాల్ని తేదీలు, నెలలు, సంవత్సరాల వారీగా రాయడంతో ఉద్యమ కారుని డైరీ చదివిన అనుభూతి కలుగుతుంది. దళిత కుటుంబాల స్థితి, వ్యవసాయ కార్మిక సంఘ నిర్మాణం, కూలీ రేట్లు పెంపు ఉద్యమాలు, అరెస్టులు చైతన్య పరుస్తాయి. ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో కంచికచర్ల ప్రాంతంలోని భూములకు రెక్కలొచ్చాయి. 10 ఎకరాల రైతుకు 10 వేలు అప్పు పుట్టేది కాదు. ఇప్పుడదే రైతు కోట్ల లోకి వెళ్ళాడు. (పేజీ 174) ఎకరం మూడు వేల రూపాయలు అంటే గొప్ప ఇప్పుడేమో కోటి, రెండు కోట్లట! ఇలా ఎన్నో విషయాలు గ్రామీణ వాతావరణం గురించి తెలుసుకోవాల్సిన అంశాలు ఎన్నో ఈ "నేను- నా ఊరు" లో దొరుకుతాయి. 88 సంవత్సరాల దొడ్డపనేని వారి జీవితాన్ని అధ్యయనం చేయాలి. ముఖ్యంగా వామపక్ష కార్యకర్తలంతా. కృష్ణా జిల్లా అనగానే ఎందరో కమ్యూనిస్టులు కనిపిస్తారు. పి . ఎస్, సి.ఆర్, కె. ఎస్ లాంటి వారి చరిత్రలు స్ఫూర్తినిస్తాయి. గుంటూరు బాపనయ్య, సనకా బుచ్చికోటయ్య, చల్లపల్లి నారాయణరావు, సూరపనేని, కడియాల లాంటి వాళ్ళ చరిత్రలూ రావాలి. ముందు తరాలకవి మార్గదర్శకంగా నిలుస్తాయి.



నేను - నా ఊరు
దొడ్డపనేని రామారావు
పేజీలు : 186,
వెల : రూ.60/-
ప్రతులకు: దొడ్డపనేని రామారావు, 13/140, ఎన్‌హెచ్ 9, కంచికచర్ల, కృష్ణా జిల్లా.
ఫోన్ : 9948570473

- తంగిరాల చక్రవర్తి

తప్పక చదవాల్సిన చరిత్ర

గతం తెలియకపోతే వర్తమానం గందరగోళమై భవిష్యత్ చీకటవుతుంది. నేడు మరోసారి ఆటవిక పాలనవైపు అడుగులు వేస్తున్న మన దేశంలో చరిత్రలోకి తొంగి చూడటం తప్పనిసరి. అందుకు "ప్రపంచ కార్మికోద్యమ చరిత్ర" పుటలు తిప్పాల్సిందే. ఈ చిన్న పుస్తకం కార్మికోద్యమ ప్రారంభదిన ఉద్యమాలు, పోరాటాలకంటే శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంత ఆవిర్భావ ఆవిష్కరణను అర్థం చేసుకునేందుకు తోడ్పడుతుంది. ప్రపంచ కార్మికోద్యమం వెనకున్న సైద్ధాంతిక పునాదిని ఈ పుస్తకం మన ముందుంచుతుంది. ఊహాజనిత సోషలిజం ఏవిధంగా, ఏ పరిస్థితుల్లో ఆవిర్భవించిందో స్పష్టం చేస్తుందీ పుస్తకం. కార్మికోద్యమం 'నడవాల్సిన తీరు' గురించి ఈ పుస్తకంలో పేర్కొన్న "ఇంటర్నేషనల్ స్థాపన" చదివితే అర్థమౌతుంది. నిరుద్యోగుల సహాయానికి ట్రేడ్ యూనియన్లు స్పందించాల్సిన ఆవశ్యకత తెలుస్తుంది. ఆ విధంగా నడవాల్సిన దారి స్పష్టమౌతుంది. ప్రజలతో సంబంధాలు కలిగి ఉండాల్సిన అవసరాన్ని 52వ పేజీ చివరి పేరాలో ఉంది. నేడు అది ఎంత అవసరమో వేరే చెప్పాల్సిన అవసరం లేదు కదా! నేడు పొట్టచేత పట్టుకుని జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల సరిహద్దులు దాటి విస్తరిస్తున్న అసంఘటిత కార్మికుల దయనీయ, దౌర్భాగ్య పరిస్థితుల్లో వారిపై అంతే దౌర్భాగ్యంలో వున్న "స్థానికులు" దాడులు చేయడం చూస్తున్నాం. "ప్రపంచ కార్మికోద్యమం" చదివితే ఈ స్థితిలో అప్పుడేం చేశారో, ఇప్పుడు మనం ఏం చేయాలో అర్థమౌతుంది. ప్రత్యేకంగా, మనదేశంలో 'మోడిఫికేషన్' నేపథ్యంలో దేశంలో దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలన్నింటిపై ఒక్క కలం పోటుతో విధ్వంసం జరుగుతోంది. దీనికి "అభివృద్ధి" ముసుగు తొడిగారు. అమిత్‌భాదురి అన్నట్లు ఇది "అభివృద్ధి ఉగ్రవాదం" (డెవలప్‌మెంటల్ టెర్రరిజం) కార్మికోద్యమం కొన్ని రంగాల్లో తమ డిమాండ్ల సాధనకే పరిమితమైపోయి, విశాల ప్రజానీకంతో సంబంధాలు తెంచుకుంటున్నది. ఈ స్థితి వివిధ రంగాల్లో నేడు మనం చూస్తున్నాం. ఈ విషయంలో కా॥బి.టి.ఆర్ 1971 డిసెంబర్ వర్కింగ్ క్లాస్ సంచికలో కేంద్ర ప్రభుత్వోద్యోగులకు చేసిన హెచ్చరిక గమనార్హం. ఈ నలభై ఏళ్ళలో పరిస్థితి ఇంకా దిగజారింది. ఈ "జబ్బు" దాదాపు అన్ని రంగాలకీ అంటుకుంటున్నది. "ప్రపంచ కార్మికోద్యమ చరిత్ర" చదివితే నేటి కార్మికోద్యమంలోని ఇటువంటి పొరపాటు ధోరణులు అర్థమౌతాయి. మన కర్తవ్యం సుబోధకం అవుతుంది. ఈ పుస్తకానికున్న పరిమితులను మనం గమనంలో పెట్టుకోవాలి. దాదాపు 90 సంవత్సరాల కిందటి తెలుగు భాషకు, నేడు మనం వ్యవహారికంగా వాడుతున్న భాషకూ కొన్ని తేడాలున్నాయి. దీన్ని కూడా పాఠకులు గమనంలో వుంచుకుని 'విషయానికి' ప్రాధాన్యతనిచ్చి పుస్తకాన్ని అధ్యయనం చేయాలి. ట్రేడ్ యూనియన్ ఉద్యమం గురించి పాఠాలుగా బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ వారు ప్రచురించిన నాలుగు కరపత్రాల వంటి చిన్న పుస్తకాల సంకలనానికి మహీధర రామమోహనరావు గారి అనువాదమీ పుస్తకం.



ప్రపంచ కార్మికోద్యమ చరిత్ర - మహీధర రామమోహనరావు,
పేజీలు: 80, ధర: రూ.60,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు.

- ఆర్.సుధాభాస్కర్






సూక్ష్మ సౌందర్యం

సూదిలో దారం ఎక్కించాలంటే?! కళ్లు చికిలించి... ఊపిరి బిగబట్టి ... మెల్లగా ఆ చిన్ని రంధ్రంలోకి దారం పంపేందుకు ప్రయత్నిస్తాం. మరి ఆ బెజ్జంలో బుజ్జి బుజ్జి బొమ్మలు నిలబెట్టాలంటే... మాటలా?! కళా తపస్సు చేయాల్సిందే. విల్లార్డ్ విగాన్ సృజించిన కళాకృతులు సరిగ్గా అలాంటివే. వాటిని చూడాలంటే కళ్లు చికిలించాల్సిందే. మైక్రోస్కోప్ చేపట్టాల్సిందే. ఆయనగారు చేసే కళాఖండాలు అంత సూక్ష్మంగా వుంటాయి మరి. అయితేనేం! ఒకసారి చూశారూ...అంటే ఆశ్చర్యానందాలతో అవాక్కైపోవాల్సిందే.

సూది బెజ్జంలో పట్టేంత సూక్ష్మాతి సూక్ష్మ ఆకృతులను రూపొందించడమంటే విల్లార్డ్‌కు మహా ఇష్టం. ఈ ఇష్టం ఇప్పుడు పుట్టింది కాదు! అతనికి అయిదేళ్ల ప్రాయంలో కలిగింది. అదీ చీమలకు చిన్ని చిన్ని ఇళ్లు కట్టేప్పుడు. బర్మింగ్‌హామ్‌కు చెందిన ఈ యాభైఏడేళ్ల కళాకారుడు ఇప్పటికి ఎన్నో అద్భుతాలను సృజించాడు. గుండు సూది తల మీద పట్టేంత సూక్ష్మ ఆకృతులను కూడా చేస్తుంటాడు. కోతి నుంచి సూటు బూటు వేసుకున్న మానవుడి వరకు పరిణామ క్రమాన్ని తన సూదిబెజ్జపు కళాకృతులుగా మలిచి అబ్బుర పరిచాడు. ఒక్కో బొమ్మను చేయడానికి అతనికి మూడు మాసాల సమయం పడుతుందట. విల్లార్డ్ ఓర్పు, సహనానికి హేట్సాఫ్ చెప్పాల్సిందే. ●





ఒంటెల పండగ

ఏడాదికో మారు జరిగే ఎడారి ఓడల పండుగ కోసం స్థానికులే కాదు. విదేశీయులూ ఎదురు చూస్తుంటారు. రాజస్థాన్‌లోని బికనేర్ అనే చిన్ని గ్రామం అందుకు వేదిక. ఈ సందర్భంగా గ్రామస్తులు రంగురంగుల వస్త్రాలు, అందమైన ఆభరణాలు ధరిస్తారు. పొడవాటి మీసాలు, రంగురంగుల తలపాగాలు, చెవులకు వెండి బంగారు రింగులతో పురుషులు... మేలి ముసుగులతో మహిళలు... విదేశీ సందర్శకులు... ప్రధాన ఆకర్షణ.

ఒంటెల పండుగను ఈనెల 4-5 తేదీల్లో జరుపుకున్నారు. గ్రామ పరిసరాలన్నీ డేరాలు, ఒంటెలతో, వారి కుటుంబాలతో జనమయమైపోయింది. ఇక్కడ ఎన్ని రకాల పోటీలు జరిగాయనీ! ఒంటెల అందాల పోటీలు, డాన్స్ పోటీలు వాటిలో ప్రధానమైనవి. అందాల పోటీ జరిగేటప్పడు వాతావరణం ఒక్కసారిగా ఉత్కంఠభరితంగా మారిపోతుంది. సరదాగా... ఒంటెల పాలు పితికే పోటీ కూడా పెట్టేస్తారు. ఒంటె పాలతో చేసిన టీ, తీపి పదార్థాలకు భలే గిరాకీ. ఇహ మహిళలకు జరిగే పరుగు పందెం గురించి కూడా చెప్పకోవాలి. ఇది మామూలు పరుగు పందెం కాదు. కుండలు నెత్తి మీద పెట్టుకుని మరీ పరుగెత్తాలి. అయితే స్థానిక మహిళలతో విదేశీ యువతులు పోటీ పడడం ప్రత్యేక ఆకర్షణ. రాజస్థానీ జానపద సంగీత, నృత్య ప్రదర్శన అద్భుతం. మహిళలు తమ ఎర్రటి పావడాలు బుట్టలా వచ్చేలా గుండ్రంగా తిరుగుతూ చేసే డాన్స్ చూడ్డానికి రెండు కళ్లూ చాలవు. ఇవి కాక సూర్యోదయానికి ముందు.. సూర్యాస్తమయం తర్వాత నెగళ్ల ముందు మహిళలు చేసే నృత్యం, పురుషులు ఆలపించే సంగీతం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇవేనా...! ఉట్టె కొట్టడం, తాడు లాగడం, పొడవాటి మీసాల పోటీ, పెళ్లి కుమార్తెల పోటీ, ఒంటెలూగుర్రాల పరుగు పందాలు.. వీక్షించాల్సిందే కానీ ఎంత వర్ణించినా అసంపూర్ణమే. ●